// # సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 38 సంచిక 8
పేజీలు 44
ఏప్రియల్ 2019

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.............................. 6
అమ్మమాట..................................... 9
శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్ అక్షరధామము .......12
ధనుర్మాస వైభవము ............................14
విశ్వాసం ....................................16
సప్తసప్తాహాల సత్సంగ సమావేశాల - విజ్ఞప్తి 18
ఆధ్యాత్మికంలో హాస్యకథలు ........................19
భక్తికే ప్రాధాన్యతనిస్తాడు
భగవానుడు ................21
సీతా పరిత్యాగము ..............................23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........................25
శ్రీకృష్ణ కర్ణామృతము ..............................26
పరిప్రశ్న ...................................... 27
అభ్యాసం ........................ ..........................29
పరివర్తన .................. ...................... .................32
కైవల్యోపనిషత్ ... ......................................34
వింటే బాబు బోధనే వినాలి! -
తింటే బాబు ప్రసాదమే తినాలి ! ......36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37
భీముని భక్తి ........................... .........................39.
విష్ణు కథలు ...... ........................ ......................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

7. **స్వరేణ సన్ధయోద్యోగమ్ అస్వరం భావయేత్ పరమ్।**
**అస్వరేణాను భావేన, న భావో భావ యిష్యతే ॥**

సాధకుడు ముందుగా తన సాధన యొక్క ధ్యేయాన్ని గుర్తించాలి. సాధన యొక్క ధ్యేయం గూర్చిన పూర్తి అవగాహన కలిగి వుండాలి. ధ్యేయం భాషకు, భావనకు, క్రియకు అతీతమని గుర్తించాలి. భాషకు, భావనకు, క్రియకు తోడ్పడే ఇంద్రియాలు సాధన ధ్యేయమైన పరమపదాన్ని చేరుకోవడానికి, గుర్తించడానికి, లేదా అనుభవించడానికి తోడ్పడవు అనేది సాధకుడు స్పష్టంగా గ్రహించాలి. యోగము అనేది ప్రాపంచిక విషయాత్మకమైన కార్యమునకు దూరమైనప్పుడే అది సాధ్యపడుతుంది.

యోగము అనేది ఇంద్రియాలకు అధీనమైన మనస్సు అంతర్ముఖమై ఆత్మ వస్తువుతో కలయిక చెందటం. దీనిని సాధించడానికి ప్రాథమిక దశలో సాధకునికి ఇంద్రియాల తోడ్పాటు అవసరం. అంటే ఇంద్రియాల సమన్వయాన్ని, సంయమనాన్ని సాధించి తీరాలి. ముందుగా సాధనలో సంకీర్తనలో పాల్గొనటం, భగవత్సంబంధమైన గ్రంథాలను పఠనం చేయుటం, తత్త్వ సంబంధమైన చర్చల్లో పాల్గొనటం, పూజ, అలంకరణ, ఉపాసనలాంటివి కొనసాగించటం అవసరమే. అందువలన భావన, భాష, క్రియ అనేవి సాధన యొక్క ప్రాథమిక దశలో సాధకుడు పురోగమించడానికి తోడ్పడతాయి.

ఉదాహరణకు మనమేదైనా ప్రదేశాన్ని సందర్శించాలి అని అనుకున్నప్పుడు ముందుగా ఆ ప్రదేశం ఎక్కడ ఉంది? దానిని ఎలా చేరాలి? ప్రయాణం ఎలా సాగించాలి? అనే వివరాలను సేకరించాలి కదా! ఆ తరువాతే ప్రయాణం సాగిస్తాము. అలాగే సాధన యొక్క పూర్వ దశలో మన దేహాన్ని, ఇంద్రియాలను, బుద్ధిని అన్నింటిని సాధన దిశలో సమాయత్త పరచి, ప్రాపంచికపరమైన వ్యవహారాల నుండి నిగ్రహింప

జేసి, వాటిని ఆత్మపరంగా చింతన, విచారణకు మరలించడమే సాధన యొక్క ఉత్తర దశలో సాధకుడు నిర్వహించవలసిన విధిగా గుర్తించాలి.

ఉత్తర దశలో తాను గ్రహించిన మంగళకరమైన భావాలను అనుసరించాలి. ఈ రకమైన సాధన కొనసాగించిన సాధకునికి 'న భావో భావ ఇష్యతే' అన్నట్లుగా అజ్ఞానం వలన గాని, తెలిసీ, తెలియని సాధన ప్రయత్నం ద్వారాగాని, విశ్వాసం లోపం వలనగాని, ఇంతవరకు అవగాహనలేని పరమపదమైన ధామమును ఇప్పుడు తాను పొందాలనే తీవ్రమైన ఆకాంక్ష కలుగుతుంది.

## తాపత్రయాగ్ని సంతప్త సమాహ్లాదన చంద్రికా

ముందుగా తాపత్రయం అంటే ఏమిటో చూద్దాం. ప్రతి మనిషికీ మూడు రకాల తాపాలు వుంటాయని వేదాంతంలో చెప్పబడింది. అందులో మొదటిది ఆదిభౌతిక తాపం - అంటే ఇతర మనుష్యుల వలన కానీ, జంతువుల వలనగానీ, లేదా మరే యితర భౌతిక పదార్థాల వలనగాని కలిగే బాధలు. రెండవది ఆదిదైవిక తాపం - అంటే దైవికంగా సంభవించే వరదలు, భూకంపాలు మొదలైనవాటి వలన కలిగే బాధలు. మూడవది ఆధ్యాత్మిక తాపం - అంటే మనస్సు పెట్టే బాధలు, భయాలు, సంకోచాలు, మానసిక రోగాలు, దుస్స్వప్నాలు మొదలైనవి.

ఇటువంటి మూడు తాపాలతోను బాధపడే మనుష్యుల హృదయాలకు ఆహ్లాదకరమైన చల్లదనాన్నిచ్చి, స్వస్థత కలిగించే చంద్రునివంటిది జగన్మాత. ఆ జగన్మాతను హృదయంలో నింపుకున్న భక్తులకు ఇతర జీవులుగానీ, మానవులుగానీ, ఎంటువంటి కష్టాన్నీ కలిగించలేరని మనకు అనేక భక్తుల చరిత్రలలో నిరూపిత మైనదికదా! ఇక నిత్యం ఆత్మానందంలో ఓలలాడే అటువంటి భక్తులు ప్రకృతివైపరీత్యాలను గుర్తించనే గుర్తించరు. మరి మనస్సంతా జగన్మాతతో నిండిపోయాక ఇక మానసిక రోగాలకుగానీ, భయసంకోచాలకుగానీ చోటెక్కడ?

- పాలూరి ప్రసాద్

# శ్రీబాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న మీ అందరికీ పుణ్యం దక్కుతుంది. మీలో ఒక్కరు తరించినా నా జన్మ ధన్యమవుతుంది. ఇక్కడ నవగ్రహాలు కూడ వెలుస్తాయి" అన్నారు శ్రీ బాబు. "కొందరు మహానుభావులు, నాకూ పరమాత్మకు ఏమిటి బేధం? నాలోను పరమాత్ముడు ఉన్నాడు కదా! కాబట్టి ఈ ద్రవ్యం నేను తీసుకొంటే తప్పులేదు అని హరి ఓం తత్‌సత్ చేసేవారున్నారు. ఒక అపరాల వ్యాపారంచేసే వ్యాపారి రైతులవద్ద నుంచి మచ్చుకని అపరాలు పోగుచేసి, లక్షాధికారియై మేడ కట్టాడు. కాని చివరికి ఒట్టి చేతులతో మట్టి పాలయ్యాడు. కుటుంబం సర్వనాశనం అయింది. తిండికి లేక పిల్లలు భ్రష్టులయ్యారు. అతనివెంట ఏం వచ్చింది? భగవానుని ద్రవ్యాన్ని ఆశించిన వారి గతి అంతే. అలాకాక చిత్తశుద్ధితో భగవంతుని ద్రవ్యాన్ని ఆయనకే సమర్పిస్తే, మన క్షేమం, మనద్వారా పుత్రాదుల క్షేమం అంతా ఆయనే చూసుకొంటాడు.



కాశి, శ్రీశైలం, కేదారనాథ్, బదరీనాథ్ మొదలైన క్షేత్రాలలో జాతి, కుల, మత భేదాలు లేకుండా అందరికి ప్రవేశం ఉంది. అలాగే ఈ ఆశ్రమంలోని ఆలయాలలో సర్వమానవ కోటికి, జాతి, కుల, గోత్ర భేదాలు లేకుండా భగవానుని సేవించుకొనే హక్కు, అవకాశం కల్పించాలి. స్వజాతి, విజాతి స్వగత భేదరహితుడై సోదర మానవులందరిని సమానంగా ప్రేమించి, కష్టములలోనున్న ఒక్కతోటి మానవుని కన్నీరు తుడిచి, ఆ మానవుని దైన్యాన్ని పోగొట్టటానికి తన సర్వస్వాన్ని త్యాగం చెయ్యటానికి ఎవరు సిద్ధపడతారో, అతడు భగవానునికి అత్యంత ప్రియుడు.

మహాత్ములు సమస్త భూతములందు సమభావము, సమదృష్టి

కలిగి ఉంటారు. అట్టి మహర్షులు కారణజన్ములు. వారు తాము తరించటమేకాక, అనేకమందిని తరింపచేస్తారు. శ్రీ రమణ మహర్షి అటువంటి మహాత్ముడు. అట్టి మహాత్ములు గృహస్థులలోనూ ఉన్నారు.

డొక్కా సీతమ్మగారు ఆత్మస్వరూపులు. ఆమెఉత్తమ సాధ్వి, మహా త్యాగి. గోదావరి ప్రాంతంలో నది ఒడ్డున భర్తతో నివసించేవారు. వారు సామాన్య కుటుంబీకులు. పెద్ద స్థితిమంతులు కారు. అయినా వారింటికి ఏ వేళప్పుడు ఎవరు వచ్చినా, ఎందరొచ్చినా, అర్ధరాత్రయినా, అపరాత్రయినా ఆదరించి ఆ తల్లి అన్నం పెట్టేది. ఆ ప్రాంతంలోని ప్రయాణీకులంతా ఎన్నో మైళ్ళు నడిచైనా సరే, అలసి వారింటికి వచ్చి, భోజనం చేసి వెళ్ళేవారు. చూశారా! సీతమ్మగారి ఆదరణ అటువంటిది. దేశం కరువుకాటకాల్లో మగ్గిపోతున్నా, వారి ఆస్తి అంతా తరిగిపోయినా, ఆమె మాత్రం తన పవిత్రమైన ఉద్యమం మాత్రం మానలేదు. ఒకసారి గోదావరినది వరదలో ఉంది. అర్ధరాత్రి చాల దూరంనుంచి 'అమ్మా! డొక్కా సీతమ్మగారూ రక్షించండి! రక్షించండి' అని వినబడింది. ఆమె వెంటనే భర్తను లేపి లాంతరు తీసుకొని నదిఒడ్డుకి చేరేసరికి, ఒక వ్యక్తి కొయ్య దుంగను ఆధారం చేసుకొని, కొట్టుకుని వస్తున్నాడు. సీతమ్మగారు, ఆమె భర్త అతనిని ఒడ్డుకి చేర్చారు. ఆ దంపతులిరువురు అతనిని ఇంటికి తీసుకెళ్ళి, పొడివస్త్రం ఇచ్చి, చలి కాచుకునేందుకు మంటచేసి, అతనిని తమ ఆత్మబంధువుకంటే ఎక్కువగా ఆదరించారు. తత్ఫలితంగా డొక్కా సీతమ్మగారిని ఆ గ్రామపెద్దలు కులంనుంచి వెలివేశారు. అయినా ఆవిడ మాత్రం జాతి, కుల, వివక్షత లేకుండ అందరినీ ఆదరించేవారు.

నూజివీడు మహారాజుగారి భార్య అప్పారాణిగారిని బ్రహ్మపిశాచి పట్టుకొని వేధిస్తోంది. ఎన్నిరకాల వైద్యం చేసినా, ప్రయత్నాలు చేసినా ఫలితం కనబడలేదు. ఆ బ్రహ్మపిశాచి పూర్వజన్మలో వేద పండితురాలు అయిన కారణంగా, ఏ రకమైన మంత్రాలూ ఆ పిశాచిని విముక్తి చెయ్యలేకపోయాయి. ఆ బ్రహ్మపిశాచత్వం అస్పృశ్యత, అంటరానితనం ప్రోత్సహించిన కారణంగా కలిగింది. అట్టి బ్రహ్మపిశాచిని విముక్తి చెయ్యటం సామాన్యులకు సాధ్యపడుతుందా? పండితులంతా చేరి అస్పృశ్యతా నివారణకు కృషిచేసి పుణ్యం ఆర్జించిన డొక్కా సీతమ్మ

వంటివారు, తమ పుణ్యఫలాన్ని ధారపోస్తే అప్పారాణిగారు బ్రహ్మపిశాచి నుండి విముక్తి పొందగలరని నూజివీడు రాజుగారికి చెప్పారు. డొక్కా సీతమ్మగారు తాను ఆర్జించిన పుణ్యఫలాన్ని ధారపొయ్యటానికి అంగీకరించారు. ఆమె బంధువులు అట్టి ప్రయత్నాన్ని మానమని హెచ్చరించారు. 'నేను ఆర్జించిన పుణ్యం ధారపోసినంత మాత్రాన తరిగిపోతుందా? నేను పుణ్యాన్ని ధారపొయ్యటం వలన పుణ్యఫలాన్ని తిరిగి పొందుతాను' అన్నారు డొక్కా సీతమ్మగారు. బలిచక్రవర్తి వామనుడికి తన సర్వస్వమును ఏ విధంగా దానం చేశాడో, అదేవిధంగా అప్పారాణిగారికి, సీతమ్మగారు తన పుణ్యఫలాన్ని దానం చేశారు. బ్రహ్మపిశాచి తొలగిపోయింది. మహారాజుగారు సపరివారంగా డొక్కా సీతమ్మగారి ఇంట విందు భోజనం చేశారు. ఆ విందులో సీతమ్మగారు చేసిన గరికపచ్చడి మహారాజు గారిని బాగా ఆకర్షించింది. 'ఇంత రుచికరమైన వంటకం ఇంతవరకు నేను ఎన్నడూ తినలేదు, అని మహారాజుగారు చెప్పి, దానికి ప్రతిఫలంగా డొక్కా సీతమ్మగారికి గరికెను పెంచి, యాత్రికులకు విందు భోజనంలో గరికపచ్చడి అందజేయటానికి, భూమిని దానం చేశారు. ఈనాటికీ అది గరిక అగ్రహారంగా వ్యవహరించబడుతోంది.

నూజివీడు మహారాజువారు కూడ పుణ్యాత్ములు. ప్రజలను చక్కగా పాలించేవారు. దయార్ద్ర హృదయులు. ప్రజలకు కావలసిన సౌకర్యాలు కలగచేసేవారు. ఒకసారి మంత్రితో పర్యటన చేస్తుండగా, నక్కల ఏడ్పులు వినిపిస్తాయి. 'ఆ నక్కలు ఎందుకు ఏడుస్తున్నాయి?' అని రాజుగారు ప్రశ్నిస్తారు. మంత్రివర్యులు దానికి సమాధానం చెప్తూ 'మహారాజా! నక్కలు చలిబాధకు తట్టుకోలేక ఏడుస్తున్నాయి. దానిని నివారించటానికి కంబళ్ళు కొనాలి' అని సలహా ఇస్తారు. అలాగే మహారాజుగారు కంబళ్ళను కొనమంటారు. అయితే, ఆ కంబళ్ళని మహారాజుగారి ఆస్థానంలోని మానవాకారంలో ఉన్న నక్కలు వినియోగించుకొంటాయి. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. భగవంతుని సేవించటానికి అంటరానితనం, అస్పృశ్యత, అనేవి అడ్డు వస్తాయా?" అని ప్రశ్నించి బోధను ముగించారు శ్రీ బాబు.

(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

## వేదాంత వీధుల్లో విహరించు గిరిధారి

'నేను' అనేది పరమాత్మ స్వరూపం. దానినే 'ఆత్మ' అని, 'చైతన్యం' అని కూడా అంటారు. అదే ప్రణవ స్వరూపం. 'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ' అని భగవద్గీతలో చెప్పబడినట్లుగా, భగవత్తత్వాన్ని ఒక్క అక్షరంలో చెప్పాలంటే 'ఓం' అనే ప్రణవమే. ఈ ప్రణవ నాదం మనలోనే వుంది. ప్రణవం లేకపోతే భగవన్నామానికి అర్థం లేదు. ఏ మంత్రానికైనా సరే ముందు ప్రణవం వుండి తీరాల్సిందే. అది లేని మంత్రం శిరస్సులేని మొండెం వంటిది. **'ఓం నమశ్శివాయ', 'ఓం నమో నారాయణాయ', 'ఓం నమో భగవతే వాసుదేవాయ'**- ఏ మంత్రానికైనా సరే ముందు ప్రణవం వుండి తీరవలసినదే.



నీ గురుదేవులు ప్రసాదించిన మంత్రాన్ని తైలధారవలె చేసుకో. అది కూడా ఒక అనుష్ఠానం ప్రకారం ఒకే టైములో చేసుకోవాలి. అలా చేసినదానికి ఫలితం ద్విగుణీకృతమయి చక్కటి సత్ఫలితాల నిస్తుంది. బీజాక్షర సంపుటీకరణ చేసి, మంత్రాన్ని మనకు ప్రసాదిస్తారు మహాత్ములు. ఇది మందులాగ టైమ్ ప్రకారం చేస్తూ, తగిన పథ్యాన్ని ఆచరించి అనుష్ఠానం దీక్షగా చేయాలి. అది కూడా శ్రీ సద్గురుదేవుల సాన్నిధ్యంలో చేస్తే మనకు మరింత శక్తి చేకూరుతుంది. ఇంట్లో చేసిన దీక్షకు, గురుసాన్నిధ్యంలో ఆశ్రమంలో చేసిన దీక్షకు ఎంత తేడా వుంటుందో నేను వేరుగా మీకు చెప్పనక్కర్లేదు. మందు వేసుకునేటప్పుడు పథ్యం చేయటం ఎంత అవసరమో, సాధన చేసేటప్పుడు సాధకుడు కూడా పథ్యం చేయాలి. కామ క్రోధాది గుణాలు, ఈర్ష్యాసూయలు, ప్రపంచ విషయాలు దరికి రానీయకుండా పథ్యం చేయాలి. రోగం తగ్గాలంటే మందు కరెక్ట్‌గా టైమ్ ప్రకారం వేసుకున్నట్టు ఈ భవరోగమనే జబ్బు నుంచి మనం బయట పడాలంటే భవరోగ మహావైద్యుడు ఇచ్చిన లక్ష్యార్థమనే ఔషధాన్ని మూడు పూటలా సేవించాలి.

శ్రీ గురుదేవులు ప్రసాదించే మంత్రాలు అనేక విధాలుగా వుండవచ్చు. ***'ఓం నమశ్శివాయ', 'ఓం నమో నారాయణాయ'*** ఇత్యాది తారక మంత్రాలు జపించే మంత్రాలు. ***'హంస శివస్సోహమ్'*** వంటిది సూచన మంత్రం. ఇది జపం చేసే మంత్రం కాదు. ఈ మంత్రం విచారణ చేసి, తద్రూపాన్ని పొందాలి. ఇక ***'అహం బ్రహ్మాస్మి'*** అనే మంత్రం మహావాక్య మంత్రం. ఇది జపం చేసేది కాదు. ఇది కేవలం అనుభవం. అహం బ్రహ్మాస్మి అంటే నేను బ్రహ్మను అయి వున్నాను అనేది నోటితో చెప్పేదికాదు. అది అనుభవైక వేద్యం మాత్రమే. అది పొందినవారి భావన ఎలా వుంటుంది? వారికి అంతా బ్రహ్మమయమే. పరబ్రహ్మ స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ దానిని మనకి ప్రత్యక్షంగా చూపెట్టాడు. ఆయన వెన్నని తీసుకు వెళ్ళి గోపబాలురకే కాదు, పిల్లికీ, కోతులకీ కూడా పెట్టాడు.

ఇట్టి బ్రహ్మభావనతో ఏకీకృతమైన మహాత్ముడు కబీర్‌దాసు, తాను తింటున్న రొట్టెను ఒక కుక్క వచ్చి ఎత్తుకుపోతూ వుంటే, ఆయన నెయ్యి గిన్నె పట్టుకుని దాని వెనకాతలే 'రామా! రామా! ఆగవయ్యా! ఆ రొట్టెకి కాస్త నెయ్యి రాస్తానయ్యా! లేకపోతే అది చాలా గట్టిగా ఎండిపోయి వుందయ్యా!' అంటూ ముళ్ళ కంపల మీద నుండి దూకుతూ, ఒళ్ళంతా రక్తం కారిపోతున్నా లెక్క చేయకుండా పరుగెత్తాడు! ఉన్నదంతా బ్రహ్మమే అన్న 'అయమాత్మా బ్రహ్మ' అనే మహావాక్యానికి నిర్వచనమైపోయాడు కబీర్‌దాసు.

తనని నమ్ముకున్న భక్తుల హృదయాలలో నుండి స్వజాతి, విజాతి స్వపర భేదాలను తీసివేసి, తనయొక్క సర్వవ్యాపకత్వాన్ని అనుభవానికి తీసుకు రావడానికి భగవంతుడు ఎంత కష్టపడతాడో మనకి భక్తుడైన తులసీదాస్ చరిత్రలో విశదమవుతుంది.

తులసీదాసు రామదర్శనమిప్పించమని ఆంజనేయస్వామిని కోరినప్పుడు, హనుమ ఆ మాట రాములవారికి విన్నవిస్తాడు. తన శిష్యుడైన తులసీదాసుకు దర్శనమివ్వమని ప్రార్థిస్తాడు. అప్పుడు రామచంద్రుడు 'హనుమా! తులసీదాసు మనస్సు ఇంకా పక్వానికి రాలేదు కనుక కొంచెం ఆగుదాము' అంటాడు. అయినా హనుమ గట్టిగా పట్టుబట్టేసరికి రాముడు ఒప్పుకుంటాడు.

హనుమ ఈ మాట తులసీదాసుకు చెప్పేసరికి ఆయన ఆనందంలో ఓలలాడుతూ, వేలాదిమంది బ్రాహ్మణులకు సంతర్పణ ఏర్పాటు చేసి, రాముని దర్శనం కోసం ఎదురు చూస్తూ వుంటాడు.

ఇంతలో ఎక్కడి నుండో ఒక పంది వచ్చి, ఆ విస్తళ్లల్లో వున్న భోజనం తింటూ, అన్ని విస్తళ్ల మీద నుండి దూకుతూ వెళ్ళి, ఆ ప్రాంగణం అంతా ఛిన్నాభిన్నం చేసేస్తుంది. ఇది చూసిన తులసీదాసు హతాశుడై ఆ పందిని కర్ర తీసుకుని కొట్టికొట్టి తరిమివేస్తాడు.

- సశేషం

## భస్మోద్ధూళిత విగ్రహాయ నమః

పేడ ఎంతో తడిగా చేతికి అంటుకుంటూ, పురుగులతో కులకులలాడుతూ దుర్గంధభూయిష్ఠంగా వుంటుంది. అదే పేడను ఎండబెట్టి అగ్నిలో దగ్ధం చేస్తే విభూతిగా మారుతుంది. అది సువాసనలను వెదజల్లుతూ అందిరకీ ఆహ్లాద కరంగా వుంటుంది. దానికి అంటుకునే స్వభావం పోయి, ఉఫ్ అని ఊదగానే ఎగిరిపోతుంది. అసలే తెల్లగా ప్రకాశించే పరమేశ్వరుడు ఎంతో ప్రీతితో ఆ భస్మాన్ని తన దేహమంతా అలదుకొని మరింతగా ప్రకాశిస్తాడు.

మలిన స్థితిలో మన మనస్సు కూడా అలాగే అన్నింటికీ అంటుకుంటూ, సంకల్పాలతో, కోరికలతో, నీచభావాలతో కులకులలాడుతూ దుర్గంధభూయిష్ఠంగా వుంటుంది. ఆ మనస్సును వైరాగ్యంతో ఎండబెట్టి, ధ్యానాగ్నిలో దగ్ధం చేస్తే అది పవిత్రమైన విభూతివలె శుద్ధ మనస్సుగా మారుతుంది. అది తన అంటుకునే స్వభావాన్ని కూడా కోల్పోతుంది. విభూతిని శరీరమంతా పూసుకోవటం అంటే ఎంతో ఇష్టపడే పరమేశ్వరుడు అటువంటి మనస్సు అంతా తానే నిండిపోతాడు.

అంతకు మించిన పరమ శాంతి ఎక్కడ వుంటుంది? అటువంటి పరమ శాంతిని ఆ భస్మోద్ధూళిత విగ్రహుడైన పరమేశ్వరుడు మనకందరికీ ప్రసాదించాలని కోరుకుందాము.

- పాలూరి ప్రసాద్



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

ఖైథాడ్‌లో మంగ్రోల్ దగ్గర ఉన్న 'లోజ్'అనే ఊరిలో ఒక ఊట బావి వద్ద పద్మాసనంలో కూర్చుని తపస్సు చేశాడు. అనంతమైన దివ్య కిరణాలు ఆయననుండి అంతటా వ్యాపించేవి. అక్కడకు ఆ ఊరి స్త్రీలు నీటి కోసం వచ్చేవారు. సుఖానంద్ అనే సాధువు అక్కడకు వచ్చి నీలకంఠుని దివ్యత్వాన్ని గ్రహించి తన గురువుగారైన ముక్తానందస్వామి వారి వద్దకు తీసుకొని వెళ్ళాడు. అది రామానందాశ్రమము. ముక్తానందస్వామి ఆ ఆశ్రమానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు. అయిదు తత్త్వాల రహస్యం గురించి నీలకంఠ్ వేసిన అయిదు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి నీలకంఠుని తృప్తి పరచాడు. ఆ సమయంలో శ్రీ రామానందులు 'కచ్' లో ప్రచార కార్యక్రమంలో ఉన్నారు. నీలకంఠుడు అక్కడనే ఉండి ఆయన రాకకోసం వేచి ఉన్నాడు.

ఆశ్రమంలో ఉండి సాధువులకు ఎన్నో సేవలను చేసేవాడు. గిన్నెలు తోమటం, అక్కడ ఉన్న 50 మంది సాధువుల బట్టలుఉతకటం, గోశాల శుభ్రపరచటం , భిక్షాటన చేయటం వంటి సేవలు చేయటమే కాక సాధువులందరికీ అష్టాంగయోగం నేర్పాడు. ముక్తానందులు నడి వయస్కులు. నీలకంఠుడు యువకుడు. కాని నీలకంఠుడే వారందరికీ గురువుగా భాసించాడు. వంట చేసే చోట స్త్రీలు రారాదని అన్నాడు. సత్సంగాలలో స్త్రీలు, పురుషులు కలిసి కూర్చునే పద్ధతిని మాన్పించాడు. స్త్రీలు ఒకవైపు, పురుషులు ఒకవైపు కూర్చోవాలని అన్నాడు. ధర్మబద్ధమైన ఈ సూచనలను ఆశ్రమవాసులు సంతోషంగా అమలు పరిచారు.

రామానందస్వామి రాకకై ఎదురు చూస్తూ, తమ మనో ఫలకంలోనే వారిని దర్శించాడు. కచ్‌లో ఉన్నప్పుడే రానందస్వామివారు తన శిష్యులను వెళ్ళి లోజ్ లో ఉన్న నీలకంఠ్‌ని దర్శించమని ఆదేశించారు. "నా తరువాత నీలకంఠుడే ఈ ఉద్ధవ సాంప్రదాయానికి అధిపతి" అని ఘోషణ చేశారు. శ్రీరామానందులవారు ఆశ్రమానికి తిరిగివచ్చి నీలకంఠునికి సన్యాసదీక్షను ఇచ్చి ఆయనకు

'సహజానందస్వామి' అని నామకరణం చేశారు. తమ శిష్యులనందరినీ చేరదీసి, 'సహజానందస్వామి మీకు గురువు. ఆయన ఉపదేశాలను పాటించి కృతార్థతను పొందండి' అని ఆదేశించారు. ఇది జరిగిన సంవత్సరానికి శ్రీ రామానందులవారు తమ భౌతిక కాయాన్ని త్యజించారు. ఈ మహాత్ములు చేసిన తత్త్వబోధలు:

***తత్త్వమొకటే -తత్త్వమేకం*** : ఏ మహాత్ములు బోధించినా అది సత్య వస్తువును పొందే మార్గమే. సత్య వస్తువు ఒకటే. అది శాశ్వతం, అవ్యయం, నిరాకారం, నిరంజనం. ఆయా కాలాన్ని అనుసరించి, శిష్యుల మనో పరిణతిని బట్టి వారు చేసే బోధలలో మార్పులు చేర్పులు వుండవచ్చు. వీరు బోధించినది భక్తి మార్గం. 'వైరాగ్యం ద్వారా, రాజయోగ మార్గాన్ని అవలంబించి భక్తిని పొందాలి. భక్తి పరాకాష్ట అయితేనే జ్ఞానం లభిస్తుంది. **'జ్ఞానాత్ లభతే ముముక్షుత్వం'** అన్నారు శ్రీబాబూజీ మహరాజ్.

శ్రీస్వామినారాయణ్ వారి బోధలు: ధనవ్యామోహం; స్త్రీ వ్యామోహం; ఆహార నియమం పాటించక పోవటం; అహంకారం; చెడు సహవాసం; మనస్సును నియంత్రించ లేకపోవటం - ఈ 6 ఉన్న మానవుడు సుఖ శాంతులను పొందలేడు.

***విషయవాసనలు అరికట్టలేకపోవటం*** : భూమిలోపడ్డ నీరు వలే విషయసుఖాల వల్ల ఆనందం లభించదు.

***మనస్సును సంకల్ప రహితం చేసికోవటం*** : జ్ఞానం, ఆత్మనిష్ట, వైరాగ్యం, ధర్మ పాలన ద్వారా మనస్సును నిస్సంకల్పం చేసికొవచ్చును.

***భగవత్సేవ, భగవద్భక్తుల సేవ*** : దీనివల్ల అంతఃకరణ పవిత్రమవుతుంది.

***ఆత్మ వస్తువును తెలిసికోవటమే మానవుని గమ్యం***: స్థూల సూక్ష్మ, కారణ శరీరాలు దాటిన తరువాత లోపల ప్రకాశించేది ఆత్మ అని తెలిసికోవాలి.

***ఆత్మానందం***: వైరాగ్యం, ధర్మాచరణం, ఇంద్రియ నిగ్రహం, భగవంతుని ఎడల, భగవద్భక్తుల ఎడల ప్రేమ, వారి ఎడల అనురాగం, వారి ఉపస్థితిలో ఆనందం పొందటం, భగవంతుని విశ్వసించనివారికి దూరంగా ఉండటం - దీని ద్వారా ఆత్మానందం లభిస్తుంది.

***భగవత్సాక్షాత్కారం***: ఒక క్షణం భగవద్దర్శనం లభించినా అది శతకోటి విషయాల వలన పొందే ఆనందం కన్న ఎన్నో రెట్లు మిన్న అయిన ఆత్మానందం లభిస్తుంది.

-సశేషం

# ధనుర్మాస వైభవం

(గత సంచిక తరువాయి) - సుషమ్నా ప్రసాద

ఇహ ద్వాపరయుగంలో యజ్ఞగుండమునందు ప్రభవించి, ద్రుపదమహారాజు పుత్రికగా, పాండవుల పట్టమహిషిగా ద్రౌపదిగా విరాజిల్లిన అయోనిజ.

ఇహ కలియుగంలో శ్రీఆండాళ్ తల్లి, అతిపవిత్రమైన తులసివనంలో జన్మించి, పరమ వైరాగ్యసంపన్నుడు, భక్తాగ్రేసరుడు అయిన శ్రీవిష్ణుచిత్తునిగా ప్రసిద్ధికెక్కిన పెరియాళ్వార్ ఒడిలో పెరిగి, అందరికంటె విశిష్టంగా, విగ్రహ రూపంలో వున్న శ్రీరంగనాథస్వామి అనుగ్రహానికి, అనురాగానికి పాత్రురాలై, భక్తాగ్రేసర శిరోమణిగా విరాజిల్లి విల్లిపుత్తూర్‌కు వన్నె తెచ్చిన విదుషీమణి శ్రీగోదాదేవి ఆండాళ్ తల్లి!

గోపికలాచరించిన కాత్యాయని వ్రతమహిమను తెలుసుకుని, భావనా ప్రకర్షణచేత తానొక గోపికగా మారిపోయి, వ్రతము చేయ సంకల్పించిరి. ఆ గోపికలను అనుకరిస్తూ, వారు ఒకరోజు ప్రాతఃకాలం నుండి మధ్యాహ్నం వరకు చేసిన కాత్యాయనీ వ్రతాన్ని ముప్పది (30)రోజులకు పొడిగించి, (ధనుర్మాసం 30 రోజులు) తద్వృత్తాంతము రోజుకు ఒక పాశురము (పద్యము)గా రచించి, భగవంతునికి అర్పించి, ధన్యత్వమును పొందినది గోదాదేవి. చివరిరోజు పాశురములో ఫలశృతిని అనుగ్రహించినది.

ఈ విధంగా 30రోజులు 30 పాశురములతో శ్రీరంగనాథస్వామికి ప్రేమాభిషేకము చేసి, శ్రీరంగనాథుని పరిణయమాడిన పరమపావని, నిత్యకళ్యాణి గోదాదేవి. ఆవిధంగా ఆమె భక్తి ప్రపత్తులతో, నిర్మల ప్రేమతో, సంఘ శ్రేయోభిలాషియై, కన్యలందరిచేత ఆచరింపచేసి, తరింపచేసిన ఈ వ్రతమే ధనుర్మాస వ్రతంగా ప్రసిద్ధి చెందినది. శ్రీ విష్ణుచిత్తులవారు నిత్యమూ శ్రీ విల్లిపుత్తూరునందు వెలసిన శ్రీరంగనాథస్వామికి భక్తియనే కుసుమాలను, విశ్వాసమనే దారముతో గుత్తుగా మాలికలనల్లి, స్వామికి అలంకరించి, పరవశించే పరమ భాగవతోత్తముడు. పెరియాళ్వారు విష్ణుచిత్తులవారు. గోదాదేవి 30 పాశురములు 'తిరుప్పావై' అనే ప్రబంధంగా ప్రసిద్ధి చెందింది.

ఆండాళ్ తల్లి, విష్ణుచిత్తుపెరియాళ్వార్ స్వామికి అర్పించడానికి తెచ్చిన పుష్ప మాలికలను తన సిగలో అలంకరించుకుని చూసుకుని,

అందులో అందంగా ఆకర్షణగా వున్న పూలమాలికనే ఏరి స్వామికి అలంకరించేది. ఆమె సమర్పించిన పుష్పమాలతో స్వామి సౌందర్యము ద్విగుణీకృతమయ్యేది. ఇందులోని నిగూఢ రహస్యమేమిటంటే, ఆండాళ్ తల్లిలోని ప్రతి అణవూ శ్రీరంగనాధమయమై, ఆ ముగ్ధముకురంలో తన వదనాన్ని చూసుకుంటే ఆ ప్రతిబింబం ఆమెకు రంగనాధస్వామివలె గోచరించేది. అందుచేత ఆండాళ్‌తల్లి తన శిరోజాలలో ముడుచుకున్న మాలికలనే అర్పించి, శ్రీరంగనాధుని హృదయాన్ని దోచుకున్నది. కాబట్టి ఆవెం తమిళంలో 'కోదై' (ముడిచిన మాల), ఆండాళ్ 'చూడికొడుత్తవాబియంర్' 'గోద' ఆముక్తమాల్యద అన్న సార్థక నామధేయం సంతరించుకున్నది.

గోదాదేవి అన్నది ఆ భక్తి సుమమాలికకు సార్థక నామధేయీ గోదాదేవి నామమాలికలో అనేకార్థములు స్ఫురిస్తాయి. గోదాదేవి అంటే గోప్యం తన్నుతాను దానంగా అర్పించుకున్నది. అలాగే గోదా అంటే గోవిందుని ధార అనే అర్థం స్ఫురిస్తుంది. గోదా అంటే గోపికలకు దారి చూపించినది అనే అర్థం వస్తుంది. గోదా అనే పదములో గో అంటే పవిత్రమైనది అని అర్థం. దా అంటే దారి. పవిత్రమైన దారి చూపించిన శ్రీదేవి. గోదాదేవి గోదా అంటే గోప్యమైన దాతృత్వము ప్రసాదించేది అనే అర్థం కూడా ఉంది. గోదాదేవి 'గో' అంటే గోకుల 'దా' అంటే దామోదరుని దేవి అని కూడా అర్థం. సంఘ అభ్యుదయమే తన అభ్యుదయంగా భావించి, మహిళామణులందరికీ, మహిమాన్వితమైన దారి చూపిన మహిళామణి గోదాదేవి.

గోదాదేవి పూమాలలతో, పామాలలతో, పాశురములనే మాలికలతో మానినీ చిత్తచోరుని అలంకరించి, శ్రీరంగనాధ స్వామికి ఆంతరంగిక భక్తురాలిగా, ప్రియురాలిగా విరాజిల్లి నారీమణిమాలలను స్వామికర్పించి, లోకాభ్యుదయమునకు తన జీవిత సుమమాలను అర్పించి, తన మందహాసమనే మాలను మహిళాలోకానికి అర్పించి, అలా యుగయుగాలకు తరతరాలకు మహిళా లోకానికి మణిమాలలాగా ప్రకాశిస్తున్నది.

గోదాదేవి అలా ధనుర్మాస ప్రతీకగా నిలచి, ధనుర్మాసాన్ని, మానవాళిని, మహిమాన్వితం చేయడానికి, అపూర్వ వరంగా ప్రసాదించిన మహనీయురాలు. ధనుర్మాస వైభవానికి ప్రతిరూపమే ఆండాళ్‌తల్లి గోదాదేవి!

# విశ్వాసం

- మురళి

సమర్థ రామదాస స్వామికి శివాజీ మహారాజ్‌ను పరీక్షించాలనిపించింది. శివాజీ వచ్చే సమయానికి స్వామి సమీపంలోని అడవిలోకి వెళ్ళిపోయారు. మరికొద్ది సేపటికి వచ్చిన శివాజీకి స్వామి అడవిలోకి వెళ్ళారని, ఎప్పుడు వస్తారో తెలియదని కళ్యాణ్ తెలియజేశాడు. శివాజీ అక్కడే ఎదురు చూశారు. సాయంకాలం కావస్తోందని, యిక ఎదురు చూడలేక తానే స్వయంగా సైనికులతో కలసి అడవికి బయలుదేరారు.

సమర్థుల దర్శనం కలిగే వరకు భోజనం చేయకూడదనే నిశ్చయంతో పాటు, ఎడతెరపిలేని కాలి నడక వలన బాగా అలసిపోయారు. ప్రార్థన సమయం అయ్యేసరికి దగ్గరలోని చిన్నకొలనులో స్నానం చేసి, ప్రార్థన, మానసిక పూజ, గురుమంత్ర జపం ముగించుకుని తిరిగి ప్రయాణం మొదలు పెట్టారు. 'అమ్మా! గురుమాతే! తల్లీ!' అనుకుంటూ ముందుకు వెళ్తున్నారు. అలసిపోయిన సైనికులు 'ఏమిటీ పిచ్చి!' అనుకుంటూ అనుసరించారు. కొంతమంది సైనికులు వెనుకబడిపోయారు. శివాజీ మహరాజ్ గురుదేవుని దర్శనం పొందలేకపోయినందుకు బాధతో 'అమ్మా! గురుమాతే! గురుదేవా! గురుమహారాజ్!' అని పెద్దగా పిలుస్తూ పట్టుదలతో నడుస్తూనే వున్నారు. శివాజీ చాలా ముందుకు వెళ్ళిపోయారు.

అర్థరాత్రి కావస్తోంది. అంతలో దిక్కులు మారు మ్రోగేలాగ ఓ పెద్దపులి గాండ్రింపు వినిపించింది. తరువాత ఎవరో మూలుగుతున్నట్లు వినిపించింది. చెవులు రిక్కించి విన్నారు. 'అమ్మా! జగన్మాతా! ప్రభూ! శ్రీరామా! ఈ బాధ నుండి నన్ను విడిపించమ్మా!' అని మూలుగుతున్నారు. ఆ మూలిగే గొంతు సమర్థులదేనని శివాజీ గుర్తించి, దివిటీ సహాయంతో సమర్థులను చేరుకున్నారు. సమర్థులు ఒక బండ మీద విపరీతమైన కడుపు నొప్పితో దొర్లుతున్నారు. శివాజీ స్వామిని ఒక్క అంగలో చేరుకుని, వారి తలను తన ఒడిలో పెట్టుకుని, 'నా తల్లీ! నా స్వామీ! ఏమిటీ మీ బాధ, ఎందుకిలా బాధ పడుతున్నారు, మీకేమైనది?' అని ఎంతో వ్యథతో అడిగారు. 'ప్రభూ! మీ బాధేమిటో, దానికి ఉపశమనం కలిగించే మార్గంగాని, మందుగాని సెలవిస్తే చిటికెలో మీ సన్నిధికి తీసుకొస్తాను' అన్నారు. ఎంతో సేపు బ్రతిమాలగా, దానికి మందు అప్పుడే

ఈనిన పులి పాలు అని చెప్పారు స్వామి. శివాజీ వెంటనే పాత్ర తీసుకుని ముందుకు నడిచారు. పులిపాలంటే మాటలా! ఎలా తేవాలి అనే ఆలోచన కూడా లేకుండా దాసబోధలోని 'సమర్థాచియా సేవక వక్ర సాహె ............' శ్లోకాలను వల్లెవేస్తూ ఎదురుగ ఉన్న గుహద్వారం వద్దకు చేరుకున్నారు.

ఆ గుహలోని పులి శివాజీ మీదకు దూకి, మెడ పట్టుకుంది. శివాజీ పులి పట్టు నుంచి విడిపించుకుని, దాని పంజా దెబ్బకు రక్తం కారుతున్నా లెక్కచేయకుండా పులిముందు ప్రణమిల్లి 'వ్యాఘ్రమాతా! నీ పిల్లలకుగానీ, నీకుగానీ ఏ విధమైన హాని తలపెట్టే ఉద్దేశం లేదు నాకు. తల్లీ! గురుదేవులకు కడుపులో భరించరాని బాధ కలిగింది. దానికి నీ పాలే మందని చెప్పారు. కావున నీ తనయుడనైన నా కోరిక మన్నించి, నీ పాలను ఇచ్చి గురుదేవుల వ్యాధి నివారణకు తోడ్పడవా!' అని ప్రార్థించారు. రౌద్రంగా ఉన్న పులి సౌమ్యంగా మారింది. పాలు పిండుకోమన్నట్లుగా శివాజీ దగ్గర నిలబడింది. శివాజీ పాలు పిండుకుని, పులికి నమస్కరించి గుహనుంచి బయటకు వచ్చారు. అంతలో 'జయ జయ రఘువీర సమర్థ!' అంటూ పులి ప్రక్కనే సమర్థులు ప్రత్యక్షమయ్యారు.

ఈ వృత్తాంతము చాలా మంది పాఠకులకు తెలిసే వుంటుంది. ఇక్కడ మనం గుర్తించవలసిన విషయాలు 'గురుభక్తి, గురువు పట్ల విశ్వాసం'. గురుదేవుని యందు భక్తి, విశ్వాసం అంటే శివాజీ మహరాజ్ ఆచరించిన విధంగా వుండాలి. గురుదేవులు సర్వ సమర్థులు అనే విషయం మనసా, వాచా, కర్మణా ఆచరించాలి. సమయం వచ్చినప్పుడు దానిని నిరూపించుకోవాలి. 'గురుదేవా! అంతా మీ దయ!' అంటూ నమస్కారాలు పెట్టటం కాదు. గురుదేవుని ముఖతః వెలువడిన ప్రతివాక్యం, ప్రతిమాట వేదవాక్కే. దానిని ఖచ్చితంగా ఆచరించి తీరాలి. ఎదురు ప్రశ్నలు వేయకూడదు, మరల మరల చెప్పించుకోకూడదు, ఇలాకాదు అలాకాదు అని వాదించకూడదు. గురుదేవుని వద్ద ఉపదేశం స్వీకరించటం అంటే ఆరోజే గురుదేవునికి మనస్సును, శరీరాన్ని, ఇంద్రియాలను సంపూర్ణంగా అర్పణ చేసుకొన్నట్లే. వారు ఏది అనుగ్రహిస్తే అదే స్వీకరించాలి. గురుదేవునికి సంపూర్ణ శరణాగతి అనేది ఆచరణ అయిన రోజున మన జన్మ తరించినట్లే.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న
## 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'
## భక్తులకు విజ్ఞప్తి

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ; ***2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు కుమారారామం, సామర్లకోటలో*** ; 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, ద్రాక్షారామంలో ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, భీమవరంలో ; 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, పాలకొల్లులో ; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, అమరావతిలో ; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;
కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు
కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# ఆధ్యాత్మికంలో హాస్యకథలు

(గత సంచిక తరువాయి) - కె.పి. చల్లా

**అవిద్య అనే చీకటి పోవాలంటే అది సద్గురువు వలననే సాధ్యం -**

మనం ఎన్ని సాధనలు చేసినా అవిద్య తొలగదు. అది తొలగాలంటే సద్గురు సమాశ్రయం అవసరం. ఒక విద్యాగంథం లేని పల్లెటూరివాడు ప్రక్కటౌన్‌లో ఉన్న హొటల్‌కి వెళ్ళాడు. వెయిటర్ 'మెన్యూ కార్డ్' అందించాడు. అది ఇంగ్లీష్‌లో ఉంది. ఇతనికేమో ఇంగ్లీషు రాదాయె. మెన్యూకార్డ్ చదువుతున్నట్లు నటిస్తూ పెన్సిల్‌తో ఒక ఐటమ్ మీద టిక్కు పెట్టాడు. కాస్సేపటికి వెయిటర్ ఒక ప్లేట్ ఉప్మా తెచ్చి అతనిముందు పెట్టాడు. అది చూసి అతడు బిక్కమొఖం వేశాడు. ఎందుకంటే అతని భార్య రోజూ వుప్మాయే చేసేది. విసుగు పుట్టి టౌన్‌కి వెళ్ళి మంచి మంచి టిఫెన్లు తిందామని వచ్చాడు. ఇంతలో పక్క టేబుల్ వద్ద నలుగురు కుఱ్ఱాళ్ళు వచ్చి. జిలేబి, దోశ, లడ్లు తెప్పించుకొని తింటున్నారు. అవి చాలా బాగుండటంతో వాళ్ళు వెయిటర్‌తో 'రిపీట్' అన్నారు. ఈ సూక్ష్మం కనిపెట్టి ఇతడు కూడా వైటర్‌తో 'రిపీట్' అన్నాడు. అంతే మళ్ళీ ఉప్మా ప్రత్యక్షమైంది. మరి దట్టమైన అజ్ఞానమనే చీకటిని తొలగించి సన్మార్గంలో నడిపేవాడే సద్గురుదేవుడు అన్నారు స్వామివారు.

**భ్రాంతులుడిగిన బ్రహ్మంబు బట్ట బయలు -**

ఈ జగత్తు మిధ్య. నువ్వు లేనిదానిని ఉన్నదనుకొని భ్రాంతి పడుతున్నావు. అసలు ఉన్నదానిని చూపించి నీ భ్రాంతిని తొలగించేవాడే సద్గురువు. దీనికి ఉదాహరణగా స్వామివారు : "ఒకడు పాలు త్రాగుతున్నాడు. అందులో బల్లి పడింది. ఆ బల్లిని తీయటం ఎలా? నిజానికి బల్లి పడలేదు. పాలలో బల్లి నీడ పడింది. ఇది అతని ప్రక్కన ఉన్నవాడు గ్రహించాడు. ఆ భ్రాంతిని పోగొట్టటం ఎలా? అతనికి వమనానికి ఒక మాత్ర ఇచ్చాడు. అతడు వమనం చేసుకొన్నాడు. ఆ వమనంలో ఒక చచ్చిన బల్లిని పడేసి, 'ఇదిగో ! బల్లి బయుటకు వచ్చేసింది' అన్నాడు. అతని భ్రాంతి తొలగిపోయింది. శ్రీ గురుదేవులు కూడా బోధ చేస్తూ, లేని సంసారం వుందనుకుంటున్నావు. దాని ద్వారావచ్చే దుఃఖం భ్రాంతి. గురబోధా శ్రవణం ద్వారా ఆ భ్రాంతి తొలగిపోతుంది." అని వివరించారు.

**ఆత్మానందం నీలోనే ఉన్నది -**

మానవుడు శబ్ద, స్పర్శ, రూప, రస గంధాదులలో పడి దుఃఖాల పాలవుతున్నాడు. ఆనందం బయట వస్తువులలో లేదు. లడ్డూలు రుచిగా ఉన్నాయని మితిమీరి తింటే వెగటు పుడుతుంది. నీలోపల వెదుకు.

ఆనందం లభిస్తుంది. దానికి ఉపమానంగా .........
ఒక బట్టల వ్యాపారి తిరుపతికి వెళ్తూ, జేబులోనుంచి డబ్బు చూసి లెక్కపెట్టి బ్యాగ్‌లో పెట్టుకున్నాడు. ఇది ప్రక్కనే ఉన్న ఒక దొంగ కనిపెట్టి ఆ డబ్బును కాజెయ్యాలనుకొన్నాడు. ఆ దొంగ వ్యాపారితో, ' మీరు ఎక్కడిదాకా వెళ్తు న్నారు?' అని అడిగాడు. 'తిరుపతికి' అని సమాధానం ఇచ్చాడా వ్యాపారి. 'నేనూ అక్కడికే వెళ్తున్నాను' అన్నాడు దొంగ. ఇద్దరూ కలిసి ఒక సత్రంలో బస చేశారు. వ్యాపారి నిద్ర పోతుండగా అతని వస్తువులన్నీ సోదా చేశాడీ దొంగ. కాని డబ్బు దొరకలేదు. తెల్లవారింది. దొంగ, 'మిత్రమా! నిన్న నీ దగ్గర డబ్బు ఉండటం చూశాను. ఎక్కడ పెట్టావేమిటి? ' అని అడిగాడు. ' ఆ డబ్బు నీ దిండు క్రింద పెట్టి, నేను హాయిగా నిద్ర పోయాను' అన్నాడు ఆ వ్యాపారి. అలాగే మనం మనలో ఉండే ఆనందాన్ని పొందలేక బయట వస్తువులలో వెదుకుతున్నాము'

**3.పదవవాడు ఎవరు? (ఉపనిషత్కథ ఆధారంగా) -**

పరమానందయ్య గారి వద్ద పదిమంది శిష్యులు ఉండేవారు. ఒకనాడు ఆ శిష్యులు, గురువుగారితో, 'మేము పండగకి మా ఊరు వెళ్తాము. అనుమతి ఇవ్వండి' అని అర్థించారు. ' కొన్ని పనుల వల్ల నేను మీతో రాలేకపోతున్నాను. జాగ్రత్తగా వెళ్ళి వస్తారా?' అన్నారు గురువుగారు. వారిలో ఒకడు ముందుకు వచ్చి, 'నేను పూచీకత్తు తీసుకుంటాను.' అన్నాడు. వారు దారిలో వడిగా ప్రవహిస్తున్న నదిని దాట వలసివచ్చింది. ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని నదిలో దిగారు. కాని నీటి ఒరవడి వలన విడిపోయారు. చివరికి అవతలి ఒడ్డుకు చేరారు. అందరినీ లైనులో నుంచోబెట్టి ఆ బాలుడు లెక్కపెట్టాడు. లెక్కకు తొమ్మిది మంది వచ్చారు. అరే మనలో ఒకడు తప్పిపోయాడు అని అంతటా వెదికారు. కాని ఫలితం శూన్యం. వారు దుఃఖిస్తుండగా, ఒక పెద్ద మనిషి అక్కడికి వచ్చి, 'కంగారు పడకండి' అని లైన్‌లో ఉన్న తొమ్మిదిమందిని లెక్కపెట్టి, ఈ బాలుడిని లైన్‌లో నుంచోబెట్టి, 'ఆ పదవవాడవు నీవే' అన్నాడు. వారు ఎంతో సంతోషించారు.అంతటా వెదుకుతాము. కాని మనని మనం లెక్కించుకోము. తానెవరో గుర్తించక బయట ప్రపంచంలో వెదుకుతాము. కాని నువ్వు నువ్వుగానే ఉన్నా నీ ఉనికిని నువ్వు గుర్తించలేకపోతున్నావు. 'నేను' అంటే బయట నేనుకాదు. నీలో ప్రకాశిస్తున్న 'నేను' అదే ఆత్మ!

# భక్తికే ప్రాధాన్యతనిస్తాడు భగవానుడు

- గాలి జగదీశ్

ఒక ఊరిలో ఒక బీద బ్రాహ్మణుడు వుండేవాడు. అతనికి ఎంతో భక్తితో శ్రద్ధలతో గుడిలో అర్చనలు చేయాలని వుండేది. కాని అతని దగ్గర ఏమాత్రమూ పైకము లేదు. ఒకరోజు అతను ఎవరో ఆచార్యుడి ప్రవచనం విన్నాడు. 'భగవంతుని మానసికంగా కూడా పూజించవచ్చు. బాహ్యపూజలతో పనిలేదు' అని. అది విని ఎంతో కాలం నుంచి దీనికోసమే ఎదురు చూస్తున్న ఆ బీద బ్రాహ్మణ భక్తుడు వెంటనే గోదావరి నదిలో స్నానం చేసి, వెళ్ళి, ప్రశాంత వాతావరణంలో ఒక చెట్టు క్రింద కూర్చుని మనస్సులోనే భగవంతుడిని ఆరాధించడం మొదలుపెట్టాడు ఆ ఆచార్యుడు చెప్పినట్లుగా.

భగవంతుడు సింహాసనముపై కూర్చున్నట్లుగా, తాను క్రింద ఒక ఆసనంపై కూర్చున్నట్లుగా, పూజా ద్రవ్యాలు అన్నీ సమకూర్చుకున్నట్లుగా; పంచనదుల నీటితో భగవంతునికి స్నానం చేయిస్తున్నట్లుగా భావన చేస్తాడు. తరువాత స్వామికి, శుభ్రంగా తుడిచి, మంచి పట్టు వస్త్రాన్ని ధరింపజేసి; గంధము, తిలకము దిద్ది; బంగారు ఆభరణాలతో అలంకరించి; పలురకముల సువాసనలు వెదజల్లే పుష్పాలతో పూజించి, ధూప, దీప, నైవేద్యములు చేస్తున్నట్లు తలచి, తానే స్వయంగా పాయసాన్నం వండినట్లు భావనచేసి, దేవుని ముందు పెడతాడు. పాయసం వేడివేడిది పెట్టరాదని తలచి, చల్లారిందేమో అని చూద్దామని ఆ గిన్నెలో వేలు పెడతాడు. కానీ పాయసం ఇంకా చల్లారకపోవటం వలన తన చేయి కాలుతుంది. దానితో అతడు ధ్యానం నుండి మేలుకొని, బాహ్యప్రపంచంలోకి వచ్చి చూస్తే అక్కడ ఏమీ కనబడదు. కానీ అతని వేలు ఎందుకు కాలిందో అని అతనికి ఆశ్చర్యం వేస్తుంది.

ఇంతవరకూ తాను మనస్సులోనే భావన చేస్తూ, మనసారా పరమాత్ముని ఆరాధిస్తూ వున్నాడు. ఇది అంతా ఆ వైకుంఠవాసుడు గమనిస్తూ చిరునవ్వు నవ్వుకుంటాడు. ఆ ప్రక్కనే వున్న లక్ష్మీదేవి స్వామీ! మీరెందుకు అలా మీలోమీరే నవ్వుకుంటున్నారు? అని ప్రశ్నించింది. అప్పుడు నారాయణుడు తన భక్తుని మానసిక భక్తిని గురించి వివరించి

చెబుతాడు. నారాయణుడు వెంటనే తన దూతలను పంపించి, భూలోకంలో నది ఒడ్డున తనను మానసికంగా ఆరాధిస్తున్న ఆ ప్రియతమ భక్తుడిని వెంటనే విమానంలో ఎక్కించి, తన సన్నిధికి తీసుకుని రావలసినదిగా ఆజ్ఞాపిస్తాడు.

దీనిని బట్టి మనం గమనించవలసినదేమిటంటే మానసిక భక్తి ద్వారా, మనము ఏ విధమైన ఆడంబరాలూ లేకుండా, మన మనస్సులోనే భగవంతుని ఆరాధించి, ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు అని.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2019**

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. శ్రీసద్గురుపాదపూజ.

13 శని - శ్రీరామ నవమి - శ్రీసద్గురుపాదపూజ

19 శుక్ర - చైత్ర పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

29 సోమ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

**మే 2019**

9 గురు - శ్రీ శంకర జయంతి - శ్రీసద్గురుపాదపూజ

18 శని - (శ్రీగురు) వైశాఖ పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - శ్రీసద్గురుపాదపూజ.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులు అయిన వట్టెం సుబ్బలక్ష్మిగారు (మధురై బ్యాంక్ రామం గారి తల్లి) 24-2-2019 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 86 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సీతా పరిత్యాగము

- కీ.శే నూనె వెంకటస్వామి

సీతాదేవి బాల్యంలో తన చెలికత్తెలతో కలసి ఉద్యాన వనంలో ఆడుతుండగా, చెట్టుమీద రెండు చిలుకలను చూసింది. వాటిల్లో మగ చిలుక ఆడచిలుకకు శ్రీరామచంద్రుని కథ చెప్పి, నువ్వు సీతాదేవి, నేను రామచంద్రునిలాగా వుందాము అన్నది. దానికి ఆడ చిలుక సమ్మతించింది. వెంటనే సంతోషంతో ఆ మగచిలుకతో ఆవిధంగా ప్రవర్తిస్తూ, ఆనందసాగరంలో మునిగితేలుతున్నారు.

ఇంతలో సీతాదేవి అదంతా చూసి, తన చెలికత్తెలతో ఆ చిలుకలను రెంటినీ బంధించి తన దగ్గరకు తీసుకురమ్మనమని ఆజ్ఞాపించింది. తక్షణమే వారు వాటిని పట్టితెచ్చి ఇచ్చారు.

ఆ రెండు చిలుకలను సీత పట్టి ఒడిలో కూర్చోబెట్టుకుని, తల నిమురుతూ భయపడకండి అని చెప్పి, రాముడెవ్వరు? సీత ఎవరు? మీరు చెప్పుకుంటున్న కథ ఎక్కడిది? అని కుతూహలంతో అడిగింది.

దానికి సమాధానంగా ఆ మగచిలుక మాట్లాడుతూ ఆ రెండో చిలుక తన భార్య అని, తామిద్దరూ వాల్మీకి మహర్షి ఆశ్రమ నివాసులము అని, ఆ మహర్షి రామాయణ మహాకావ్యాన్ని రచించి, తన శిష్యులకు చెబుతుండగా తామిద్దరూ విన్నామని, ఆ కథ సర్వ పాప క్షయకరమని మహర్షి చెబుతుండగా తాము విన్నామని, ఆ రామకథనంతా పూస గుచ్చినట్లు సీతకు వివరించి, ఇహ తామిద్దరనీ స్వేచ్ఛగా వదలమని సీతను ప్రార్థించింది.

రాముని సౌందర్యమును చిలుక వర్ణించి చెప్పగా విని, సీత తానే ఆ జనకమహారాజు కూతురుననీ, తన వివాహం రామునితో జరిగే వరకు ఆ చిలుకలను విడిచిపెట్టననీ చిలుకకు చెప్పింది. అంత ఆ చిలుక జంట సీతాదేవికి నమస్కరించి, తాము స్వేచ్ఛా జీవులమనీ, వాల్మీకి ఆశ్రమంలో తాము సుఖంగా వుంటున్నామనీ, దయచేసి మమ్ములను వదలమని ప్రాధేయ పూర్వకంగా చెప్పాయి. కానీ సీత వాటిని విడువలేదు.

అంత ఆ మగచిలుక తన భార్య గర్భవతి అని, బంధనమునకు ఆగలేదని, మరల తిరిగి ఇద్దరము వచ్చెదమని ఎంత బ్రతిమిలాడినా బాల్యచాపల్యము వలన సీత వినక, మగచిలుకను మాత్రమే విడిచిపెట్టి,

ఆడచిలుకను ప్రసవించిన తరువాత విడిచిపెడతానని చెప్పి పొమ్మన్నది.

మగచిలుక చెట్టుపైకెక్కి కూర్చుని, తన భార్యను విడిచి తాను బ్రతుకజాలనని, విడిచిపెట్టమని మరల మరల కోరింది. '**మౌనమే *భూషణము, వాగ్దోషమున బంధము వచ్చును***' అన్న ఆర్యోక్తి వ్యర్థము కాదు. మంచి కథ చెప్పిననూ నన్ను బంధించితివి. మగ చిలుక ఎంత బ్రతిమిలాడినను వదలలేదు. తన భర్తను విడిచి వుండలేను విడిచిపెట్టమని ఆడచిలుక ఎంత కోరినా కూడా సీత మనసు కరుగలేదు.

అప్పుడు ఆడ చిలుక గోడు గోడున ఏడ్చుచూ 'ఓ కఠినాత్మురాలా! నీవు గర్భవతియగు నన్ను నా భర్తతోఎడబాటు చేసినట్లు నీవు కూడా గర్భవతిగా వున్నప్పుడు నీ భర్తతో ఎడబాటు చెందెదవు గాక!' అని శపించి, దుఃఖభారంతో తన ప్రాణములను విడిచిపెట్టింది.

ఆ మగచిలుక కూడా 'నేను మరుజన్మలో సీతను రామునితో ఎడబాపుదును గాక!' అని చెప్పి, గంగలో దూకి తన ప్రాణములను విడిచిపెట్టింది.

ఆ మగ చిలుకయే మరుజన్మలో అయోధ్యలో రజకునిగా జన్మించి, సీతాదేవి గర్భవతిగా వున్నప్పుడు రామునికి జనాపవాదం కలిగించి, సీతాదేవి రాముని ఎడబాటుకు కారణమయింది. కర్మానుభవం ఎంతటివారికైనా తప్పదు కదా!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా, ఏప్రియల్ 2019, మే 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఏప్రియల్ 2019*** - AS 4102, 4725, 5770, 5919, 6271, 6533, 6856, 6857, 7227, 7458, 7461, 7680, 7732 నుండి 7740, 7744, 7747, 7751నుండి7759, 7761నుండి7774

***మే 2019*** - AS 3702, 7069, 7247, 7467, 7776

- మేనేజరు

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2019**

3 బుధ - మాస శివరాత్రి

5 శుక్ర - అమావాస్య

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

6 శని నుండి 12 శుక్ర వరకు మౌనధ్యాన సాధన సప్తాహ శిబిరం.

13 శని - శ్రీరామ నవమి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 11గం.లకు శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణ మహోత్సవము; భక్తసమారాధన.

19 శుక్ర - పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

29 సోమ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**మే 2019**

3 శుక్ర - మాసశివరాత్రి

4 శని - అమావాస్య

7 మంగళ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

9 గురు - శ్రీ శంకర జయంతి - శ్రీబాబు బృందావన మూర్తి ప్రతిష్ఠ 24వ వార్షికోత్సవము - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ; భక్తసమారాధన.

18 శని - శ్రీగురు పౌర్ణమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

23 గురు - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారల ప్రతిష్ఠా వార్షికోత్సవము. రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 100వ శ్లో॥**

**కదమ్బమూలే క్రీడన్తం। బృన్దావన నివేశితం।**
**పద్మాసన స్థితం వన్దే। వేణురాగయన్త మచ్యుతమ్ ॥**

**తాత్పర్యము -**

కదంబ వృక్షం క్రింద ఆడుచున్నవాడును, బృందావనమందు పద్మాసనమందు కూర్చున్న వాడును పిల్లన గ్రోవితో పాడుచున్నవాడును అగు శ్రీకృష్ణుని గురించి నమస్కరిస్తున్నాను.

చల్లనిగాలి వీస్తున్నది. అప్పుడే చిలికి తీసిన వెన్నముద్దలాగ వున్నాడు. ఆకాశంలో నిండు చంద్రుడు ఆ వెన్నెలా చల్లగానే వుంది. గాలి కూడా చల్లగానే వుంది. శరీరమంతా తాపంగా వుంది. నిద్ర రావటం లేదు. లేచి నడక సాగించాను. అడుగులు బృందావనం కేసి వెళ్ళాయి. కాళ్ళు ఆగిన చోట చూస్తే కనుల విందుగా మురళీమోహనుడి రూపం కనిపించింది. కదంబ వృక్షం క్రింద పద్మాసనం వేసుకుని కూర్చుని మురళీ వాయిస్తున్నాడు. నా శరీర తాపం చల్లారింది. నేను చేరవలసిన చోటు ఇదే అనిపించింది



మనస్సుకి. బ్రహ్మానందంలో లీనమైపోయింది నా మనస్సు. ఇదే జీవేశ్వర సంధానమేమో అనిపించింది. ఈ సంగతి ఒక్క ఆ వంశీమోహనుని సన్నిధిలో ఆనందం అనుభవించినవారికి తెలుస్తుంది కదా!

**ఏప్రియల్ 2019లో శ్రీమాతాజీవారి ఆశ్రమేతర కార్యక్రమాలు**

1) 18, 19 తేదీలలో - పరమహంస పరివ్రాజిక పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామివారి 21వ వార్షిక ఆరాధన మహోత్సవంలో పాల్గొంటారు.

2) 24-4-19 నుండి 1-5-2019 వరకు కుమారారామం సామర్లకోటలో శ్రీమాతాజీవారి ఆధ్వర్యంలో ద్వితీయ హరేరామ సప్తసప్తాహ కార్యక్రమాలు జరుగుతాయి.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

మనస్సు ప్రాపంచిక విషయాదుల చుట్టూ పరిభ్రమించడానికి కారణమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీ సద్గురుదేవులు మాట్లాడుతూ "నీరు పల్లానికి ప్రవహించటం దాని సహజ గుణం. అంతేకాదు నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడానికి కరకట్ట అనే అవధి అవశ్యం కదా! అలాగే మనస్సు యొక్క సహజ లక్షణం బహిర్ముఖమై, ప్రాపంచిక దృశ్యాలతో, శబ్దాలతో, స్పర్శలతో, క్రియలతో ఇంద్రియాల ద్వారా



తాదాత్మ్యం చెందటం దాని సహజ లక్షణం. అదే దాని ప్రధాన వృత్తి. ఈ వృత్తి రహితం కావాలంటే మనస్సు అంతర్ముఖం చెందవలసినదే. అది అసాధ్యమైన విషయం. అది ఎలా వుంటుందంటే మన వేమన గారు చెప్పినట్లు 'బొగ్గు పాల గడుగ బోవునా మలినంబు' అన్నట్లుగా వుంటుంది. ఇది అందరికీ అవగతమైనదే.

అసలు మనసును గురించి పరిశీలిద్దాం. మాతృ గర్భం నుండి వెలువడిన శిశువు బయట ప్రపంచంలో అడుగు పెట్టాడన్నమాట. అంతవరకు ఆ శిశువులో మనస్సు వునికి వున్నట్లుగా సంకేతం లేదు. అంటే మనస్సు స్వస్థానంలో వున్నదన్నమాట. మనస్సు యొక్క వునికిని తెలియజేసేది భావన, లేక తలంపు. మాతృ గర్భంలోని శిశువులో అవి వున్నాయో లేవో మనం గుర్తించలేము. శిశువు ప్రాపంచికంలోకి వెలువడగానే శారీరకమైన మార్పులు కలిగి, పరిణామం ఆరంభమై మనస్సు యొక్క వునికిని గుర్తించే సమయం ఆసన్నమవుతుంది. మనస్సు బహిర్ముఖమై నేను అనే తలంపు, లేక భావన బయలుదేరుతుంది. అదే అజ్ఞానానికి చిహ్నం. దీనినే 'బీజ జాగ్రత' అంటారు.

మనస్సు మేల్కోవటమే జాగ్రదావస్థకి సంకేతం. మేల్కొన్న మనస్సు సంకల్ప వికల్పాలకు గురికాక తప్పదు కదా! నేను అనే భావన బయల్పడక ముందు, బీజరూపంలో వాసనగా వుంటుంది. అదే జన్మకి కారణం. అదే మూలాజ్ఞానము. మనస్సు భావరహితమై, సంకల్ప రహితమై అంటే వృత్తి రహితమైనప్పుడే మనోలయమై శాశ్వతానందాన్ని ఇస్తుంది. గాఢ సుషుప్తిలో పొందేది తాత్కాలిక ఆనందమే. కేవల దుఃఖ రహిత

స్థితి. అక్కడ మనస్సు అభావ స్థితిలోగాని, వృత్తి రహిత స్థితిలోగాని లేదు. కేవలం విరామ స్థితిలో వుంది. అయితే నీ మనోవృత్తి రహితం కానంత వరకు శాశ్వతానందము లభించడం అసాధ్యం. దానిని సాధించాలంటే సమర్థులైన సద్గురుమూర్తి సమాశ్రయం లభించాలి. అంతేకాదు ఆయన ముఖస్తుగా జాలువారే గురుపదములను స్వీకరించి, మనస్సులో పదిలపరచుకుని, విచారణ చేసి, వారి ఆదేశానుసారము అడుగులు వేసిన సాధకుడి మనస్సు వృత్తి రహితమవడం తథ్యం. అటువంటి సాధకుడే గురుమూర్తికి సన్నిహితుడు. ప్రేమపాత్రుడు. అంతేగాని భౌతికంగా ఆయనకు ఎంత సన్నిహితంగా వున్నా ప్రయోజనం శూన్యం.

మనస్సు యొక్క చలనమే వృత్తికి సంకేతము. అదే బంధన తెచ్చిపెడుతుంది. మనస్సు యొక్క చలనము భావనగా, క్రియగా, పంచతన్మాత్రలు, లేక గుణాలను ఆహారంగా స్వీకరించడమే వృత్తి. దాని ద్వారా కర్మతప్పదు. అదే జన్మకి తీసుకువస్తుంది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2019**

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. సా॥ 5-30 గం. శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 శని - శ్రీరామ నవమి - సా॥5-30గం. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

19 శుక్ర - చైత్ర పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

29 సోమ - శ్రీ గురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

**మే 2019**

9 గురు - శ్రీ శంకర జయంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

18 శని - శ్రీగురు వైశాఖ పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

29 బుధ - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

# అభ్యాసం

- పాలూరి కాళీప్రసాద్

మనం ఈ ప్రపంచంలో ఏది నేర్చుకోవాలన్నా అభ్యాసం తప్పనిసరి. పుట్టిన పిల్లవాడు తల్లి దగ్గర పాలు త్రాగటం నుంచి, ముసలివాడయ్యాక మనవలతో ఆడుకోవడం వరకు ప్రతిరోజు ఎన్నో విద్యలను అభ్యసిస్తూనే వుంటాడు. అలాగే అసలు నీవెవరవో, నీ అసలు స్వరూపం ఏమిటో, ఈ కనిపించే జగత్తు అంతా ఏమిటో తెలిపే ఆధ్యాత్మిక విద్యకు కూడా అభ్యాసం అవసరమే. ఈ అభ్యాసానికి మనకు గురువులు రెండు వుపకరణాలు యిచ్చారు. అవే శ్రవణం, మననం. బ్యాంకు లాకర్‌కు రెండు తాళాలు వున్నట్లుగా మన బుద్ధికి కూడా ఈ రెండూ తాళాలే. ఒకే తాళం చెవిని ఇటు త్రిప్పితే తాళం పడుతుంది, అటు త్రిప్పితే తాళం తెరుచు కుంటుంది. అలాగే ఈ శ్రవణ మననాలనే తాళం చెవులను ప్రపంచం వైపుకు త్రిప్పితే బంధానికి దారితీస్తాయి. గురుబోధ వైపుకు త్రిప్పితే మోక్షానికి దారి తీస్తాయి. తాళం పడితే అజ్ఞానం, తెరుచుకుంటే అదే జ్ఞానం.

మనందరం స్వతహాగా పరమాత్మ స్వరూపులమే అయినా ఆ జ్ఞానం మరుగున పడిపోయి 'నేను ఫలానా, వీరు నా బంధువులు, ఇది నా కులం, గోత్రం, దేశం, ప్రాంతం' అనే బంధనాలు మనకు మనమే తగిలించుకుని సతమతమవుతున్నాము. మదాలసవంటి తల్లి మన అందరికీ దొరికి వుంటే, పుట్టిన క్షణం నుండి 'నువ్వు ఈ దేహానివి కావు, దీనికి కలిగే హాని వృద్ధులు, సుఖదుఃఖాలు నీవి కావు. ఈ దేహానికి పేరు కోటేశ్వరరావు అయినా దానివల్ల నీకు ఒరిగేది ఏదీ లేదు, దీనిపేరు భిక్షపతి అయినా నీకు పోయేది ఏదీ లేదు. ఈ కనిపించేది అంతా నశించిపోయేదే. నీవు శాశ్వతుడవు' అని నూరిపోసేది. కానీ మన తల్లిదండ్రులు మనం పుట్టిన క్షణం నుండి, 'నేను అమ్మను, నేను నాన్నను, ఇది నీపేరు, మేమంతా నీ బంధువులం, వారు పరాయివారు. ఇది నీ యిల్లు, అది పరాయిది. ఇది నీ బొమ్మ, ఎవరికీ యివ్వకు. నువ్వు బాగా చదివి మా పేర్లు నిలబెట్టాలి. బాగా సంపాదించాలి, కూడబెట్టాలి' ఇలాంటివే నూరిపోస్తున్నారు.

నిజానికి చిన్నారి పాపలకు ఈ తరతమ భేదాలు ఏవీ తెలియవు.

వారు ఎవరిని చూసినా నవ్వుతారు. చేతిలో వున్నది ఎవరడిగినా యిచ్చేస్తారు. ఒక రుచికరమైన తినుబండారం ఇస్తే ఎలా తింటారో, అలాగే తాము విసర్జించిన మలాన్ని కూడా చేత్తో తీసి నోట్లో పెట్టుకుంటారు. కానీ ఈ పెద్దలు చేసే నిరంతర బోధలవలనే వారు అదే శ్రవణ మననాలు కలిగి ప్రాపంచిక బంధాలలో ఇరుక్కుపోతున్నారు. అటువంటి మానవులు తమ నిజ తత్త్వాన్ని తెలుసుకోవడానికి సద్గురువులను ఆశ్రయించి, గురుబోధ శ్రవణం ద్వారా అసలు తత్త్వం అర్థం చేసుకోవాలి. అయితే నిరంతర మననం, నిదిధ్యాస లేనప్పుడు అది నిలబడదు.

ఒక ఉదాహరణ చూద్దాం. ఒక పిల్లవాడికి చిన్నప్పటి నుండి 'రెండు రెళ్ళు ఆరు' అని నేర్పించామనుకోండి, వాడికి అదే శ్రవణం, మననం వలన ఆ తప్పు లెక్కే వాడి మనస్సులో స్థిరంగా నాటుకుపోతుంది. అలాంటి పిల్లవాడు బడికి వెళ్ళినప్పుడు అక్కడ ఉపాధ్యాయుడు ముందుగా 'రెండు రెళ్ళు నాలుగు' అని చెప్పినా వీడు నమ్మడు. అప్పుడు ఆయన ఒక నాలుగు పెన్సిళ్ళనో, రూపాయి బిళ్ళలనో తీసుకుని ప్రాక్టికల్‌గా నిరూపిస్తారు. ఈ పిల్లవాడు మొదట ఆశ్చర్యానికి గురయినా తరువాత మెల్లగా అర్థం చేసుకుంటాడు. అయితే అంతకుముందు నరనరాన జీర్ణించుకుపోయిన తప్పుడు లెక్క అంత తేలికగా పోదు. హఠాత్తుగా ఎవరైనా 'రెండు రెళ్ళు ఎంత?' అనగానే ఠక్కున 'ఆరు' అంటాడు. అందుకే ఆ ఉపాధ్యాయుడు వీడికి అర్థం అయిన తరువాత కూడా అనేకసార్లు 'రెండు రెళ్ళు నాలుగు' అని నెమరు వేయిస్తూ వుంటాడు. అయితే పిల్లవాడు యింటికి రాగానే మళ్ళీ తల్లి 'రెండు రెళ్ళు ఆరు' అని చెబుతూ వుందనుకోండి, ఇక వీడికి అసలైన లెక్క రావటం ఎంత కష్టం?

అలాగే మనం నిత్యం ఈ ప్రపంచంలో చూసినదంతా సత్యం అనే అందరి ద్వారా వింటున్నాం, దానినే మననం చేస్తున్నాం. ఎప్పుడో ఒకసారి గురువుల ద్వారా 'ఇదంతా మిథ్య, నీ అసలు తత్త్వం వేరు' అని విన్నా అది పురాణ వైరాగ్యం లాగా అక్కడి నుంచి లేచి ఇవతలకు రాగానే మళ్ళీ మరపుకు వచ్చేస్తోంది. ఎందుకంటే మన శ్రవణ మననాలనే తాళం చెవులు నిరంతరం ప్రపంచం వైపుకే త్రిప్పబడి బంధాన్ని కలిగిస్తున్నాయి. మనం పుట్టినప్పుడినుండే కాక ఇంతకు ముందు ఎన్నో జన్మల నుండి కూడా ఇదే అభ్యాసం చేస్తూ వస్తున్నాం. ప్రపంచం వైపుకు తిరిగిన ఈ

శ్రవణ మననాలు చివరికి అధ్యాస, లేదా భ్రాంతికి దారి తీస్తున్నాయి. ఈ భ్రాంతి తొలగి మనలో జ్ఞానకాంతి ప్రకాశించాలంటే ఇంతకంటే మరెన్నో రెట్లు ఎక్కువగా గురుబోధని శ్రవణం, మననం చేయాలి. అప్పుడు అది నిదిధ్యాసకు, లేదా ఆత్మానందానుభూతికి దారి తీస్తుంది.

అంతటి తీవ్రమైన అభ్యాసం లేకపోతే 'రెండు రెళ్ళు నాలుగు' అని ప్రత్యక్షంగా నిరూపణ అయినా మళ్ళీ ఆ పిల్లవాడు హఠాత్తుగా అడిగితే ఏమరుపాటుగా 'ఆరు' అని చెప్పినట్లే, మనకు ఒకవేళ భగవద్దర్శనం కలిగినా కూడా మళ్ళీ మాయ ఆవరించి ఈ జగత్తే సత్యమనే భ్రమలో పడిపోతాం. ఎంతమంది రాక్షసులకు తపస్సు వలన భగవద్దర్శనం కాలేదు? వారందరూ ఆ క్షణం గడవగానే తిరిగి మాయలో పడిపోలేదా? **Practice just makes it permanent. So beware of what you practice and make sure you always practice the perfect thing.** అభ్యాసం మనలను పరిపూర్ణులుగా చేస్తుంది అనే ఒక భ్రమ ప్రచారంలో వుంది. కానీ పైన చెప్పుకున్నట్లు మనం తప్పు విషయాన్ని అభ్యాసం చేస్తే ఆ తప్పే మన మనస్సులో శాశ్వతంగా నాటుకుపోతుంది. ఎప్పటికీ పరిపూర్ణులం కాలేము. అభ్యాసం కేవలం మన మనస్సును అభ్యసించే విషయం మీద స్థిరంగా నిలుపుతుంది. కాబట్టి పరిపూర్ణుడు కావాలంటే పరిపూర్ణమైన విషయాన్నే అభ్యాసం చేయాలి.

మన మనస్సుకు పట్టిన అజ్ఞానానికి కారణమైన వాసనలను, కర్మలను, గురుబోధా శ్రవణ మననాలు దగ్ధం చేసేస్తాయి. శ్రవణం వలన భూతకాలంలోని కర్మలు, వాసనలు రహితం అవుతాయి. మననం వలన వర్తమాన కాలంలోని కర్మలు, వాసనలు రహితం అవుతాయి. ఇక అలా నిదిధ్యాసను పొందినవాడికి భవిష్యత్తులో కర్మలు, వాసనలు అంటుకునే ప్రశ్నే లేదు. అయితే నిజమైన శ్రద్ధ, వైరాగ్యం కలిగి శ్రవణం చేయాలి. అలా శ్రవణం చేసిన పరీక్షిత్తు మోక్షాన్ని పొందాడు.

# పరివర్తన

- కీ.శే నునె వెంకటస్వామి

శ్రీ రామానుజాచార్యులవారు శ్రీరంగనాథ స్వామివారి దేవాలయమును కేంద్రంగా చేసుకుని, వైష్ణవ మతాన్ని ప్రచారం చేసే రోజులవి. ఆలయ నిర్వహణకు అకళంగుడనే చోళ సామంత రాజును నియమించాడు.

అకళంగునకు ధనుర్దాసు అనే అంగరక్షకుడు వుండేవాడు. అతను ఆజానుబాహుడు. చూపరులకు నిండుగా, గంభీరంగా వుండే వాడు. అతని భార్య పొన్నాచి. ఆమె అతిలోక సౌందర్యవతి. ఇతను భార్యను అమితంగా ప్రేమిస్తూ, ఆమెను ఒక క్షణం కూడా విడిచి వుండటం ఎంతో ఎడబాటుగా భావిస్తూ వుండేవాడు.

ఒకరోజు ఆ దంపతులిద్దరూ చైత్రోత్సవంలో శ్రీరంగనాధుడి దర్శనార్థం వచ్చారు. తన ప్రేయసి ఎండలో నడచి వస్తుంటే, ఎక్కడ కందిపోయి అలసిపోతుందో అని ధనుర్దాసు ఎండతగలకుండా గొడుగు పట్టి నడుస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో శ్రీరామానుజాచార్యులు శిష్య సమేతంగా వస్తూ ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు.

ఆయన శిష్యులలో ఒకనికి ఈ ధనుర్దాసు అంటే అసహ్యం. అతడు కామాంధుడు అని అతని అభిప్రాయం. అదే అభిప్రాయాన్ని గురువుగారికి వ్యక్తం చేశాడు. కాని రామానుజాచార్యులవారు అతని అభిప్రాయం తప్పని, అతడు కామాంధుడు కాడనీ, సత్యమైన ప్రేమికుడని తలచారు. ఆ ప్రేమ ఎంత గాఢమైనదంటే ఎవరేమనుకున్నా సరే, లక్ష్యపెట్టదు. అట్టి ప్రేమికుడు భగవదనుగ్రహానికి పాత్రుడవుతాడని, భార్యా ప్రేమికుణ్ణి భవగద్భక్తుడిగా మార్చటం చాలా సులభమని అనుకున్నారు.

శ్రీ రామానుజాచార్యులవారు నేరుగా ధనుర్దాసు దగ్గరకు వచ్చి, 'బాబూ! నీవు చేస్తున్న పని ఏమిటి?' అని అడిగారు. దానికి అతడు, 'నా భార్య లోకోత్తర సౌందర్యవతి, నేను ఆమె సౌందర్యాన్ని ఆరాధిస్తున్నాను' అని సమాధానం చెప్పాడు.

శ్రీరామానుజులవారు మాట్లాడుతూ 'లోకములో ఇంతకంటె సుందరమైనవి, మానవమాత్రుల కంటే అనేకానేక రెట్లు శాశ్వత సుఖాన్ని, శాంతిని కలుగజేసేవి వున్నాయి' అని చెప్పారు. అయితే వాటిల్లో ఒకటి తనకు చూపమని ధనుర్దాసు అడిగాడు.

వెంటనే రామానుజులవారు ధనుర్దాసును తన వెంట తీసుకుని, శ్రీరంగనాధుని ఆలయానికి వెళ్ళారు. సూర్యోదయం వేళ, అరుణ కాంతులు సోకి విచ్చుకునే పద్మము వలె, జగన్మోహనాకారంగా భాసించే, శ్రీరంగనాధుని విశాల నయనములను ధనుర్దాసుకు చూపించారు.

ధనుర్దాసు ఆ విశాలనేత్రములను చూసి, ఆశ్చర్యపడి, నోటమాట రాక, ఆత్మానందానుభూతిలో ఓలలాడుతూ అలాగే వుండిపోయాడు. శ్రీరామానుజులవారు అతనిని తట్టి, స్మృతిలోకి తీసుకువచ్చారు. వెంటనే ధనుర్దాసు ఆయనను శరణాగతి పొందాడు. అతని భార్య పొన్నాచి కూడా వారిని ఆశ్రయించి శిష్యురాలైపోయింది. ఆ దంపతులిద్దరూ శ్రీ రామానుజాచారుల వారిని గురువుగా స్వీకరించి, శ్రీరంగనాధుని దివ్యసేవలో ధన్యమైనారు.

ఆ అకళంగుడు సామంతరాజు కూడా తన అంగరక్షకుడు స్వామివారి శిష్యుడయ్యాడని తెలిసి, తాను కూడా వారినే ఆశ్రయించి జన్మ ధన్యత చేసుకున్నాడు. మహాత్ముల కృపాకటాక్ష వీక్షణం అంత గొప్పది!!

***శ్రీ మన్నారాయణుని రెండు పాదములపైనా రెండు చేతులూ ఉంచు. ఒక చేత్తో ప్రాపంచిక వ్యవహారాలను చక్క బెట్టుకుని, తిరిగి ఆయన పాదాల చెంతకు చేర్చు. అటు ఆత్మానందమూ లభిస్తుంది, ఇటు నారాయణుని భార్యయైన లక్ష్మీదేవి కటాక్షమూ కలుగుతుంది. అనగా సకల దరిద్రములు తీరుతవి.***

- శ్రీ బాబూజీ మహరాజ్

(గత సంచిక తరువాయి) # కైవల్యోపనిషత్ - రేఖ

బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి మొదట్లోనే బ్రహ్మవిద్యను తెలుసుకోవడానికి ధ్యానమార్గాన్ని (యోగమును) సూచించాడు. ధ్యానం ఏ విధంగా చేసుకోవాలో విశదీకరించి చెబుతున్నాడు. ఆ విషయాన్ని శ్రీ మాతాజీ ఈ విధంగా బోధ చేశారు ....

నిర్వికార, నిర్గుణమయిన విషయాన్ని ఎలా చేజిక్కించుకోవాలో తెలుపుతున్నారు. గురువులు మనకు లక్ష్యార్థమిచ్చిన తరువాత ఏకాంత ప్రదేశంలోగాని, పవిత్రదేవాలయంలోగాని, పూజగదిలోగాని, మరి ఏవిధమైన అలజడి, జనసంచారం లేనిచోటగాని కూర్చుని ధ్యానము చేసుకోవాలని చెబుతారు. ప్రదేశం ఏకాంతంగా వుంటే చాలదు. మన మనస్సు ఏకాంతంగా వుండాలి. అంటే ప్రాకృతిక భావాలు మనస్సులోకి రాకూడదు. ఎలా కూర్చుంటే మనకు సుఖంగా వుంటుందో ఆ విధంగా కూర్చోవాలి. ధ్యాన ప్రక్రియ అంటే మన ఇల్లు మనం చక్కబెట్టుకోవడం.

ఈ దేహం పరిణామంతో కూడుకుని వున్నది. అది వయస్సుతో లేదా అనారోగ్యంతో మార్పు చెందుతుంది. దానికి తగినట్లుగా, గురువులు మనకు ఆదేశించిన విధంగా, ధ్యానం ద్వారా పరిణామం చెందనిది ఒకటి మనలో వున్నదని గ్రహించి, ఈ దేహం వుండగానే ఆ పరమాత్మను అనుభవించాలి. శుచిగా అంటే బయట పరిసరాలలోను, హృదయంలోను కూడా ఏ విధమైన మలినం లేకుండా వుండాలి. శిరస్సును, మెడను, శరీరాన్ని సరియైన వరుసలో సమంగా వుంచుకోవాలి. మెడగాని, నడుముగాని వంగిందంటే నిద్రకు తావిచ్చినట్లే.

బాహ్యంగా సన్యసించడం కంటే, ఆ భావనతో వుండటం ఇంకా గొప్ప విషయం. సమస్త ఇంద్రియాలను నిరోధించాలి. ఈ విధంగా మనకు మన గురువులు, జగద్గురువైన గీతాచార్యుడు శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో ఆరవ అధ్యాయం, ఆత్మసంయమ యోగంలో అర్జునుడికి వివరించాడు. సాధకుడు, ధ్యానయోగి త్వరగా విజయం సాధించడానికి ఇంద్రియాలను బాగా నిరోధించాలని చెప్పారు.

ధ్యానయోగ సాధనలో మిత ఆహారం, మిత నిద్ర, మిత భాషణ ఎంతో ఆవశ్యకం. ఎందుకంటే ఈ మూడూ కూడా మన శరీరం మీద , మనస్సు మీద క్రమంగా పనిచేస్తాయి. అందులో అలసత్వం, విషయాసక్తి వున్న మానవుడికి ఈ ధ్యానయోగం ఇంకా కష్టతరమవుతుంది. అందువల్ల సన్న్యాస భావం (విషయ వాంఛల ప్రభావం నుండి మనస్సును మళ్ళించుకోవడం) అవసరం. ఇంద్రియ సంయమనం ముఖ్యంగా ధ్యానసమయంలో అత్యంత అవసరం.

ఈ విధంగా ఇంద్రియాలను నిగ్రహించి, భక్తితో గురువుకు నమస్కరించాలి. అంటే ఎక్కడపడితే అక్కడ నమస్కారం చేయాలని కాదు దాని అర్థం. నిరంతరం మనస్సులో నమస్కరిస్తూ, హృదయంలో గురువు యెడల సర్వసమర్పణ భావం కలిగివుండి, ఏ పని చేస్తున్నా, అది గురుసేవగా చేయాలి. భావన పరిశుద్ధంగా వుండాలి. అలా వున్నప్పుడు మనలో అపవిత్రమైన, అపరిశుద్ధమైన భావనలు వుండవు. మన దృష్టి, ఆలోచన, వినికిడి, చేతలు, అన్నీ పవిత్రంగా, గురుపరంగా వుంటే అదీ నిజమైన *'భక్త్యా స్వగురుం ప్రణమ్య'* - భక్తితో తన గురు దేవునికి నమస్కరించడమంటే.

ఏ మాలిన్యము లేని హృదయపద్మమునందు పరిశుద్ధ భావనతో గురుపరమాత్మను ధ్యానం చేయాలి. జపమాల త్రిప్పుతూ, కొలికిపూస ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటే హృదయ మాలిన్యం పోదు. జపం చేసే నామం మీద మనస్సు నిలిచిపోవాలి. తదనుభూతిని పొందాలి. అప్పుడు హృదయం పవిత్రమవుతుంది. అంతేగానీ, పవిత్రమైన నదులలో స్నానం చేస్తేనో, సబ్బులు పెట్టి రుద్దుకుంటేనో హృదయ మాలిన్యం తొలగి పవిత్రమవదు. విచారణ వల్లనే ఆ మాలిన్యం పోతుంది.

ఉపనిషత్తు నిరంతర ధారణ చేయమన్నది. ఎప్పుడూ ప్రకాశించే అంతర్లీనమైన వస్తువు ఏదై వున్నదో దానిని సాధనలో పెట్టుకోవాలి. దానిని ఎలా ఉపాసన చేయాలో మంత్రం చెబుతోంది.

-సశేషం

## వింటే బాబు బోధనే వినాలి! - తింటే బాబు ప్రసాదమే తినాలి!

- రమణ ప్రసాద్

గోదాదేవి చెలులతో కలిసి కాత్యాయని వ్రతం చేస్తూ 'పర' అనే వాయిద్యం కోరింది. కాని కృష్ణ దర్శనం అయ్యాక ఆమె పర కోరలేదు. నువ్వు పూజ చేస్తున్నావు. దేవుడు ప్రత్యక్షం అయ్యాడు. అప్పుడు ఆయనకు సేవ చేస్తావా? లేక పూజలో తదుపరి కార్యక్రమం సాగిస్తావా? పరమేశ్వరుని దర్శనం అయింది. పొందాల్సింది పొందావు.

గోపికలు కాత్యాయిని వ్రతం చేయటానికి వెళ్తుంటే కృష్ణుడు ఎదురై, 'మీరు వ్రతం చేసేది నన్ను భర్తగా పొందాలనే కదా! మరి నేను మీముందు ఉన్నాను. నన్ను సేవించండి' అంటాడు. ఆ ప్రభువు ఆలంబనం దొరికితే ఇంక కావల్సిందేమున్నది? ప్రపంచంలో మార్పు చెందని దానిని ఆశ్రయించాలి. ఆయనే భగవంతుడు.

నల్లనయ్య లీలలు వర్ణింపనలవికానివి. ఆయన ఆవు తోకను తాత గడ్డానికి కట్టాడు. నా జన్మ చరితార్థం చెందినదనుకుంది. ఆవు దూడ. కృష్ణయ్య తన పట్ల చూపిన ప్రేమకు ఆనందించాడు తాత. అహా! నన్ను తరింపచేసే దైవం నాకు లభించాడు అనే మూలాన్ని అతడు గ్రహించాడు.

భగవంతుని దివ్యచరణారవిందములపై మనసు నిలిపితే అలౌకికమైన సుఖ శాంతులు లభిస్తాయి. మనకు ఈ అవకాశాన్ని ఇచ్చి మనలను మధురానుభూతులలో ముంచి తేలుస్తూ కాలాన్ని మరిపింపజేస్తున్నారు శ్రీ గురుదేవులు.

'నీ చెయ్యి ఎప్పుడూ విడిచిపెట్టను' అన్న విషయం ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. ఆ బుల్లి కిష్టయ్యకోసం చేసే నిరీక్షణలో ఎంతో ఆనందం ఉంది. 'కంటే ఇలాంటి వాడినే కనాలి, తింటే బాబు ప్రసాదమే తినాలి! బ్రహ్మానుభూతిని పొందాలి - అదే మన గమ్యం కావాలి. అప్పుడే ఈ జీవితం ధన్యత చెందుతుంది.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

"జీవితంలో పరీక్షలూ, అనుభవాలూ యిలా ఉంటాయని నిరూపించటానికే శ్రీబాబు యిలా చేశారని, వారికి నా యెడల యింత ప్రేమాదరములు కలగటం నా పూర్వ జన్మ సుకృతం వలననే అని ఆ తరువాత గ్రహించగలిగాను. ఆ పరమ సౌజన్య మూర్తి అమృత వాక్కులు విన్న తరువాత నా అజ్ఞతకు, మూర్ఖత్వానికి సిగ్గు పడ్డాను. నాలోని లోపములను, తెలిసీ తెలియక మాట్లాడిన మాటలను క్షమించమని వారిని వేడుకున్నాను."



యాత్రా సమయంలో తాము శ్రీ బాబులో గమనించిన విశేషాలను శాస్త్రిగారు యిలా వ్రాసుకున్నారు. -'1 యాత్ర బండిలో భక్తుల కోసం ఆయా మజిలీలలో వంట చేసినప్పుడు, అన్నాతురులై వచ్చిన యితర యాత్రికులకు అన్నదానం చేయించారు. 2. తీర్థయాత్రలలో స్నానాల సమయాలలోను, దేవాలయ దర్శన సమయాలలో, డబ్బును అనేక విధాలుగా యాత్రికుల నుండి గుంజుకోవటానికి ప్రయత్నం చేసే మోసగాళ్ళను దరిజేరనీయక, చాకచక్యముతో వారి ఎత్తులకు పై ఎత్తులు వేసి, వారి బారి నుండి భక్తులను తప్పించి 'మోసగాండ్రకే మోసగా' డనిపించుకున్నారు. 3. ఎవరైనా తమ సామానులను మోయగలిగినంత వరకైనా మోయక బద్ధకించి కూలీలను పిలవబోతే, శ్రీబాబు తామే కొంత సామాను తీసుకుని ముందుకు నడిచేవారు. ఇక అందరికి అలా చేయక తప్పేది కాదు. 4. దేవాలయ దర్శనమునకు వెళ్ళిన వారిలో భక్తి శ్రద్ధలు లోపించినట్లు గ్రహించిన శ్రీబాబు, తాము స్వయంగా పూనుకొని భక్తులచేత సంకీర్తన , ధ్యానము చేయించి, బోధను అందించేవారు. 5.)కాశీ, బదరీ నాథ్, కేదార్ నాథ్ మొదలైన పుణ్య క్షేత్రములలో దర్శనమునకు వెళ్ళినప్పుడు శ్రీబాబు క్షేత్రజ్ఞ స్వామి యెదుట గంటల తరబడి నిలబడిపోయేవారు. ఆ సమయంలో క్షేత్రజ్ఞ స్వామి యొక్క దివ్య తేజస్సు శ్రీ బాబులో మూర్తీభవించి కనిపించేది. 6. పుణ్య నదులలో స్నానాలు చేసే సమయాలలో శ్రీ బాబు అందరినీ

జాగ్రత్తగా చూసుకుంటూ ఎటువంటి ప్రమాదములు జరగకుండా అందరి చేత స్నానాలు చేయించారు. భయపడే వారిని, నాబోటి వృద్ధులను చేతులలోకి ఎత్తుకొని భయం పోగొట్టి స్నానం చేయించే వారు.

ఇలా వయో వృద్ధులు, పసివారు, అస్వస్థులైనవారు అందరిని వెయ్యికళ్లతో కాపాడుకుంటూ, రైలు ప్రయాణ సమయాలలోను, స్టేషన్లలో మజిలీ సమయాలలోను శ్రీబాబు రాత్రులలో భక్తులందరికీ విశ్రాంతినిచ్చి, తాము మాత్రము కళ్లలో వత్తులు వేసుకుని కాపలా కాసి, ఎవరికీ ఎటువంటి కష్ట నష్టములు, ప్రమాదములు జరుగకుండ యాత్ర పూర్తి చేయించారు. ఇది సర్వ సమర్థులైన శ్రీబాబుకు మాత్రమే సాధ్యము."

శాస్త్రిగారు శ్రీబాబును గూర్చి యింకా యిలా వ్రాసుకున్నారు. "నాకు నా అనుభవములను బట్టి, దైవజ్ఞులైన శ్రీ బాబుతో మా అనుబంధము ఏనాటిదో అనిపిస్తున్నది. నాకు, నా భార్యకు ఉపదేశ గురువులైన శ్రీ పరశు రామయ్యగారు తమ తొలి దర్శనంలోనే శ్రీ బాబును దైవ స్వరూపులుగాను, అవతారమూర్తిగాను, నిత్య పరిపూర్ణ ప్రేమ మూర్తిగాను గుర్తించి అలాగే సేవించుకున్నారు. కర్మ పుత్రుని కూడా కాదని శ్రీ బాబునే తమ జ్ఞాన పుత్రునిగా కేవల పరబ్రహ్మ స్వరూపునిగా భావించుకుని, తమ అవసాన సమయంలో కూడ వారినే తమ సన్నిధిలో నిలుపుకొని, వారి దృష్టిలోనే తమ దృష్టిని నిలిపి తనువు చాలించారు. అందువలననే మా గురువుగారు సిద్ధి పొందిన తరువాత శ్రీ బాబునే మా ఆధ్యాత్మిక గురువులుగా నిశ్చయించుకొని, అంత:కరణ శుద్ధితో వారి యెడల భక్తి విశ్వాసములను పెంపొందించుకొని, వారి అండ దండలలోనే, వారి ఆజ్ఞానుసారమే కార్యకలాపములు జరుపుకొంటున్నాము. మా ప్రయత్నములలో , మా సాధనలలో లోపములెన్నియో ఉన్నవి. అవన్నియూ వారు కృపతో గురుదేవులై క్షమించుచూ ఆదరించుచున్నారు. అనేక సమయములలో మమ్ము మందలించి, మా యెడల కోపగించిననూ, మరల వెంటనే ఆదరించి, దగ్గరకు తీసుకొని, ప్రేమ దృక్కులతో పలుకరించి,తలపైన పన్నీరు పోసి, పండ్లు, ఫలహారములు, సుభోజ్యములు, ప్రసాదములు యిచ్చి తినిపించి, ఎంతో గౌరవించి లాలిస్తున్నారు. ఎంతటి అహంకార మమకారములు మాలో తలయెత్తినను, ఆయన దయతో వాటిని తట్టుకో గలుగుతున్నాము. వారి యెడల భక్తి ప్రపత్తులను పెంపొందించు కొనుటకు ప్రయత్నిస్తున్నాము. శ్రీ బాబు మా ప్రయత్నములలో సహకరించి, వారి కృపారసమును మాపై అన్ని వేళలా వర్షింపజేసి మమ్ములను రక్షించగలందులకు ప్రార్థిస్తున్నాను.

-సశేషం

# భీముని భక్తి

- పి. విజయలక్ష్మీబాయి

పాండవులందరూ సంతోషంగా, సంతృప్తిగా జీవితం గడుపుతున్నారు. పాండవులందరూ కలసి ఉదయం లేవగానే శ్రీకృష్ణుని ప్రార్థన చేసుకునేవారు. కానీ మహా బలవంతుడైన భీముడు మాత్రం ఇందులో పాల్గొనేవాడు కాదు. కారణం ఆయన బాగా పొద్దెక్కితేగాని నిద్ర లేచేవాడు కాదు. భీముడికి భక్తిలేదని మిగిలిన సోదరులంతా గట్టిగా నిశ్చయించుకున్నారు.

అసలు భీముని పద్ధతే భాధ్యతా రహితంగా వుండేది. భోజనానికి కూడా ఆలస్యంగా వస్తాడు. ఆయన కోసం సోదరులంతా ఎదురు చూస్తూ వుండేవారు. అందుకే వాళ్ళు భీముణ్ణి ఎగతాళి చేస్తూ 'నీకు ఏనుగంత బలం ఉంది కానీ, ఎందుకూ పనికిరావు' అని అనేవారు.

భీముడికంటే చిన్నవాడైన అర్జునుడికి తాను కృష్ణుని ఆంతరంగిక స్నేహితుడననే గర్వం వుండేది. తన సోదరులందరిలో తానే కృష్ణునకు ఆత్మీయుడనని తలుస్తాడు. భీముడు అన్ని విధాల మంచివాడేకాని, ఏ మాత్రం భక్తిలేదని అర్జునుడి చింత.

ఒక రోజు అందరూ భోజనాల దగ్గర కూర్చున్నారు. భీముడు ఆలస్యంగా వచ్చాడు. అర్జునుడికి ఒక మంచి ఆలోచన వచ్చింది. రేపు కృష్ణునికి మంచి విందు ఏర్పాటుచేయాలి అని. అందరూ అంగీకరించారు. చిన్నవాడైన నకులుని కృష్ణుని ఆహ్వానించడానికి పంపించారు. నకులుడు తిరిగి వచ్చి, కృష్ణుడు రావటం లేదని, ఆయన మరొక విందుకు వెళ్ళవలసి వున్నదని, మన ఆహ్వానాన్ని మన్నించ లేక పోయినందుకు చాలా చింతిస్తున్నాని చెప్పమన్నాడు అన్నాడు. పాండవులు నిరుత్సాహ పడ్డారు. అర్జునుడు వెంటనే లేచి, 'మీరేమీ బాధ పడవద్దు. ఇదిగో నేనే వెళ్ళి శ్రీకృష్ణున్ని స్వయంగా తీసుకు వస్తాను. నా మాట ఆయన త్రోసిపుచ్చడు' అన్నాడు.

కృష్ణుడు అర్జునుడిని చూసి, ఆశ్చర్యపోతూ 'ప్రియమైన మిత్రమా! నీవు వచ్చావెందుకు? నేను విదురుని ఇంటికి వస్తానని వాగ్దానం చేశాను. ఆయనకు ఆశా భంగం కలిగించలేను. రేపు సంతోషంతో మీ ఇంటికి వస్తాను కదా, మీ సోదరులకు నచ్చచెప్పు' అని అన్నాడు. అర్జునుడి గర్వం అణిగిపోయింది. చిన్నబుచ్చుకున్న ముఖంతో ఇంటికి తిరిగి వచ్చాడు.

మరునాడు మరల భీముడు భోజనానికి ఆలస్యంగా వచ్చాడు. సోదరులందరూ విచారంగా కూర్చుని వున్నారు. ఏమిటి సంగతని అడిగాడు భీముడు. ఎవరూ మాట్లాడలేదు. మౌనంగా వున్నారు. 'సంగతేమిటో నేను తెలుసుకోవాలి. మీరు చెప్పకపోతే నేను భోజనానికి కూర్చోను' అన్నాడు భీముడు కోపంగా. అప్పుడు పెద్దవాడైన ధర్మరాజు మెల్లగా చెప్పాడు శ్రీకృష్ణుడు భోజనానికి రానన్నాడని. 'ఏమీ విచారపడనవసరం లేదు. ఆ సంగతి నేను చూసుకుంటా. ద్రౌపదీ! కృష్ణునికి బంగారు పళ్ళెంలో వడ్డించు. నేను తీసుకు వస్తాను కృష్ణుణ్ణి' అన్నాడు భీముడు. ద్రౌపదితో సహా అందరూ భీముణ్ణి చూసి ఎగతాళిగా నవ్వారు. భీముడు ఆగ్రహంతో బయటకు దూసుకు వెళ్ళాడు. ఏం జరుగుతుందో అని అందరూ అతని వెంట వెళ్ళారు.

భీముడు భయంకరమైన తన గదను తీసుకుని గిరగిరా తిప్పుతూ ఆకాశం లోనికి గిరాటు వేసి, 'ఓ కృష్ణా! నీవు ఈ క్షణంలోనే రాకపోతే, ఈ గద నా శిరస్సుపై పడి, ముక్కలైపోతా! ఇదే నా ఆన!' అని బిగ్గరగా అరచాడు. శ్రీకృష్ణుడు తన యోగశక్తితో ప్రత్యక్షమై భీముని శిరస్సుపై పడబోతున్న గదను పట్టుకొని, భీముని గాఢాలింగనం చేసుకుని, భోజనశాలకు దారి తీశాడు. ద్రౌపది, పాండవులు కృష్ణుణ్ణి చూసి అమితానందం పొందారు. అర్జునుడికి తానే కృష్ణ భక్తుడననే గర్వం అణిగిపోయింది. భీముని భక్తికి చలించిపోయాడు. ఆనాటి నుండి వారందరికీ భీముడంటే ఒక ప్రత్యేక గౌరవం ఏర్పడింది.

## వేసవిలో శిక్షణా తరగతులు

1-5-2019 నుండి 31-5-2019 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింపబడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి, సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 93463 82563

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

ఆలయం నుండి బయటకు రాగానే ఇది గురుదేవుల సంకల్పంగా గ్రహించాను. లేక పోతే నా లక్ష్యంలో మూడుసార్లు ఎలా భంగపడతాను? ఆయన వద్దకు వచ్చి ఇలా చెప్పాను. 'మహాశయా! నన్ను మరింత మూర్ఖుణ్ణి చేసి నన్నిలా మరిపింపచేశారు. ఇప్పుడు దయచేసి దారిద్ర్య బాధనుంచి నాకుటుంబాన్ని రక్షించే వరం మీరే ప్రసాదించండి' అన్నాను. ఆయన ఇలా అన్నారు. "అటువంటి ప్రార్ధన నా నోటి నుంచి ఎన్నడూరాదు. అందుకే నిన్నే ప్రార్ధించుకోమన్నాను. కాని నువ్వు ఆ పని చేయలేక పోయావు. నీ నొసట ప్రాపంచిక సుఖాలు వ్రాసినట్లు లేదు. బాగుంది నేనేం చెయ్యను?' అన్నారు.



నేను ఆయనను అంతతేలికగా విడిచిపెడతానా? నా ప్రార్ధనను అనుగ్రహించమని గట్టిగా పట్టుపట్టాను. చివరికి ఆయన "సరే! ఇంట్లో నీవారికి అత్యావశ్యకమైన అన్న వస్త్రాదులకు ఎటువంటి కొరతా ఉండదు" అని చెప్పారు. 'అతడికి సామాన్యమైన తిండి బట్టలు లభిస్తాయి' అని అమ్మ తనతో చెప్పింద'ని గురుదేవులు నాతో చెప్పారు."

"శ్రీరామకృష్ణపరమహంస కాళీమాతకు నన్ను అంకితం చేశారు. ఇప్పుడు నేను చేస్తున్న ప్రతి చిన్నదైన పనికి సైతం ఆమే మార్గదర్శకత్వం వహిస్తోందని, ఆమె సంకల్పించినదే నాతో చేయిస్తోందని నా ప్రగాఢ నమ్మకం. శ్రీరామకృష్ణులు నన్ను ఆమెకు అప్పగించివేశారు. అలా చేశాక ఆయన రెండు సంవత్సరాలు మాత్రమే జీవించారు. అందులో ఎక్కువ సమయం బాధపడుతూనే గడిపారు. శ్రీరామకృష్ణులను ముందు శ్యామపుకుర్‌లో ఉంచి తర్వాత కాశీపూర్‌కు తీసుకు వెళ్ళారు. ఈ రెండు చోట్లా భక్తులు వారికి పరిచర్యలు చేశారు."

"నేను ధ్యానానికి కూర్చున్నాను. హఠాత్తుగా నా హృదయంలో ఒక

అసాధారణ ఉద్వేగం కలిగింది. అదే కుండలినీ జాగృతం అయి ఉండవచ్చు. దాని గురించి చెప్పి ఆయనతో ఇలా అన్నాను. "తక్కిన అందరూ సాక్షాత్కార సిద్ధి పొందగలిగారు. దయచేసి నాకు కూడా ఏమైనా అనుగ్రహించండి. అందరూ సాధించారు. నేనొక్కణ్ణే అసంతృప్తితో మిగిలిపోవాలా? ఆయన, "ఏముంది నువ్వు నీ ఇంటి వ్యవహారాలను చక్కబెట్టిరా. నీకు సమస్తం సిద్ధిస్తుంది. నీకు ఏంకావాలి? అని అడిగారు. నేను ఇలా జవాబిచ్చాను "మూడులేక నాలుగు రోజుల పాటు అవిచ్ఛిన్న సమాధి స్థితిలో లయించి పోవాలన్నదే నా ఆకాంక్ష" అదివిని ఆయన "ఎంతటి అల్పబుద్ధి నీది? అంతకన్నా ఉత్తమ మైన స్థితి ఒకటి ఉంది. 'సర్వమూ నీవే' అని నువ్వు పాడుతుంటావుకదా. నువ్వు సమాధి స్థితి కన్నా ఉన్నత స్థితిని పొందగలవు" అన్నారు. నేను ఆయనతో, 'ఉదయం ఇంటికి వెళ్ళాను. ఇంట్లోని వాళ్ళంతా చీవాట్లు పెట్టారు. ఎన్నాళ్ళు దేశ దిమ్మరిలా తిరుగుతావు? నీకు న్యాయ విద్య పరీక్షలు దగ్గర పడుతున్నాయి. వాటి పట్ల శ్రద్ధ వహించకుండా తిరుగుతున్నావు' అన్నారు' అని ఆయనతో చెప్పాను. "మీ అమ్మగారు ఏమైనా అన్నారా!" లేదు ఆమె నాకు భోజనం పెట్టటానికే ఆతురత చూపింది. ఏదో కాస్త తిన్నాను.' అని చెప్పాను."

కాశీపూర్‌లోతనకు కలిగిన సమాధి అనుభవాన్ని గురించి నరేన్ ఇలా చెప్పారు. "దేహం అంటూ ఒకటి ఉన్నట్లు నాకు అనిపించలేదు. కేవలం ముఖం మాత్రమే గోచరించింది. అప్పడు గురుదేవులు మేడమీద గదిలో వున్నారు. ఆ అనుభవం నాకు క్రింద కలిగింది. నేను విలపిస్తున్నాను నాకు ఏం జరిగింది?" అని అడిగాను. పెద్దగోపాల్ గురుదేవులకు నరేంద్రుడు విలపిస్తున్నాడు అని చెప్పాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL